# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్ బుధవారం 22-10-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:54 పేజీలు:6 వెల: రూ.1/-


**నేటి కందం- నేటికి అందం**

దీపావళి వేడుక-ను
ద్దీపింపగ నౌకలందు ధీదితు లొప్పన్
చూపరి మోడీ జరుపుచు
చూపించెను భరతజాతి శూరత్వంబున్ !!

(దీపావళి వేడుకలను ప్రధాని నరేంద్ర మోడీ నౌకాదళం సిబ్బంది తో జరిపి వారిని ఉత్సాహ పరిచి లోకానికి భారత జాతి శూరత్వాన్ని తెలియ జేశారు.)

-రాధశ్రీ

సెల్:9494481210



**చురక**

పనిచేసే వాళ్లుంటెనే
పార్టీ బతికితీరుతుంది
సిద్ధాంతం స్థితి గతి
చిరకాలం సాగుతుంది

జనంలైనా వనంలైనా
జీవిస్తెనే ఉనికి హోరు
పరిస్థితులు విస్మరించి
పయనిస్తే వృధా పోరు

-వేల్పుల నారాయణ

9440433475



## మీ త్యాగాలను ఈ దేశం ఎన్నటికీ మరవదు: రాజ్ నాథ్, బండి సంజయ్



న్యూఢిల్లీ, అక్టోబర్ 21:ఢిల్లీలోని జాతీయ పోలీస్ స్మారక స్థూపం వద్ద అసువులు బాసిన పోలీస్ అమర వీరుల సేవలను స్మరిస్తూ కేంద్ర రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ శ్రద్ధాంజలి ఘటించారు. ఈ మేరకు బండి సంజయ్ అధికారికంగా 'ఛీ' వేదికగా ప్రకటన విడుదల చేశారు. 'పోలీసు వీరులారా.. మీ త్యాగాలను ఈ దేశం ఎన్నటికీ మరవదు. ప్రజాస్వామ్యంలో తుపాకీ ఉండాల్సింది పోలీసుల, సైనికుల చేతుల్లోనే. బుల్లెట్ ను నమ్ముకున్న వాళ్లు కాలగర్భంలో కలిసిపోతారన్నది చరిత్ర చాటిన సత్యం. బ్యాలెట్ ను నమ్ముకున్న వాళ్లను ప్రజాస్వామ్య వాదులంతా స్వాగతించి అక్కున చేర్చుకుంటారన్నది అక్షర సత్యం. బుల్లెట్ ద్వారా సాధించింది ఏమీ లేదు, ప్రపంచ వ్యాప్తంగా బ్యాలెట్ కు, బుల్లెట్ కు మధ్య ప్రతి ఘటనలో చివరకు గెలిచింది బ్యాలెట్ మాత్రమే. భారతీయ జనతా పార్టీ మొదటి నుండి బుల్లెట్ ను వ్యతిరేకిస్తోంది. ప్రధాని నరేంద్ర మోదీ హోంమంత్రి అమిత్ షా మార్గదర్శకంలో కొనసాగుతున్న మావోయిస్టు నిర్మూలన తుది అంకానికి చేరుకుంది. బుల్లెట్ ను నమ్ముకున్న వాళ్లు పశ్చాత్తాపంతో ఆయుధాలను వదిలి జన జీవన స్రవంతిలోకి రావడాన్ని స్వాగతిస్తున్నాం. రాబోయే మార్చి నాటికి మావోయిస్టులను పూర్తిగా నిర్మూలించడం తథ్యం' అని పేర్కొన్నారు.

## కారు బీభత్సం.. రెండేళ్ల చిన్నారి మృతి

బ నగరంలోని నార్సింగీలో ఓ కారు బీభత్సం సృష్టించింది. అల్కాపూరీ కాలనీలో ద్విచక్రవాహనాన్ని కారు బలంగా ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ప్రయాణిస్తున్న తండ్రీకొడుకులు గాలిలో ఎగిరి కిందపడ్డారు. ఈ క్రమంలో చిన్నారిపై నుంచి కారు దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో తండ్రీకొడుకులు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు అక్కడకు చేరుకుని హుటాహుటిన తీవ్రంగా గాయపడిన తండ్రి, కొడుకులను ఆస్పత్రికి తరలించారు. అయితే మార్గమధ్యలోనే చిన్నారి ప్రాణాలు కోల్పోయాడు. తండ్రి ఒడిలోనే కన్న కొడుకు కుషన్ జోయల్ ప్రాణాలు విడవడంతో ఆ తండ్రి కన్నీరుమున్నీరుగా విలపించాడు.

నార్సింగికి చెందిన నవీన్ కుమార్ తన రెండు సంవత్సరాల కొడుకు జోయల్‌ను తీసుకుని టాపాసుల కోసం ఖాజాగూడాకు బైక్‌పై వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో అల్కపూర్ కాలనీ వద్దకు రాగానే వీరు ప్రయాణిస్తున్న బైక్‌ను వెనుక నుంచి కారు ఢీకొట్టింది. ఆ తాకిడికి బైక్‌పై ఉన్న ఇద్దరు కింద పడిపోగా.. చిన్నారిపై నుంచి కారు దూసుకెళ్లింది. ఈ క్రమంలో తీవ్ర రక్తస్రావం కావడంతో ఆసుపత్రికి తరలించే క్రమంలోనే బాలుడు మృతి చెందాడు. దీంతో నవీన్ కుమార్ ఇంట్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. మితిమీరిన వేగం మరో బాలుడిని పొట్టన బెట్టుకుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీపావళి రోజు తమ గారాల పట్టి తిరిగిరాని లోకాలకు వెళ్లి పోయాడంటూ తల్లి గుండెలు బాదుకుంటూ విలపించడం అక్కడి వారిని తీవ్రంగా కలిచి వేసింది. విషయం తెలిసిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని కారు నడుపుతున్న సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ప్రవీణ్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## బంగాళాఖాతంలో వాయుగుండం..!
# తెలంగాణలో ఐదురోజులు భారీ వర్షాలు..!

హైదరాబాద్, అక్టోబర్ 21:తెలంగాణలో రాగల ఐదురోజులు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణశాఖ హెచ్చరించింది. నైరుతి బంగాళాఖాతం ప్రాంతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ఇవాళ ఉదయం అల్పపీడనంగా మారిందని పేర్కొంది. పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ బుధవారం మధ్యాహ్నం నాటికి ఉత్తర తమిళనాడు, దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరాలకు ఆనుకొని ఉన్న నైరుతి, పశ్చిమ వాయువ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా మారే ఛాన్స్ ఉందని చెప్పింది.

ఆ తర్వాత పశ్చిమ-వాయువ్య దిశగా కదిలి ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణ కోస్తాంధ్ర వైపు కదులుతూ 24గంటల్లో మరింత బలపడే అవకాశాలున్నాయని తెలిపింది. ఈ క్రమంలో తెలంగాణలో ఐదురోజులు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని చెప్పింది.

మంగళవారం కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, కామారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వానలు పడే సూచనలున్నాయని చెప్పింది. బుధవారం కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పింది. గురువారం ఖమ్మం, సూర్యాపేట, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాల్లో భారీ వర్షాలు పడే అవకాశాలున్నాయని చెప్పింది. వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ జిల్లాల్లో మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని చెప్పింది.

గురువారం, శుక్రవారాల్లో నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, నాగర్ కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాల్లో భారీ వర్షాలు పడుతాయని.. కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, కామారెడ్డి, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట జిల్లాల్లో భారీ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని వాతావరణశాఖ వివరించింది. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. గడిచిన 24గంటల్లో రాజన్న సిరిసిల్ల, నిజామాబాద్, జనగాం, కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, నల్గొండ జిల్లాలతో పాటు పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిశాయని టీజీడీపీఎస్ వివరించింది.

## మూడు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం : కలెక్టర్ హనుమంతరావు



నల్గొండ, అక్టోబర్ 21: యాదాద్రి భువనగిరి జిల్లాలో 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు సేకరణ లక్ష్యంగా పని చేస్తున్నామని కలెక్టర్ హనుమంతరావు తెలిపారు. మంగళవారం భూదాన్ పోచంపల్లి మండలం జలాల్‌పూర్ గ్రామం పోచంపల్లి పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యనీ కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

ప్రభుత్వ స్థలంలో షెడ్, రైతుల విశ్రాంతి గదుల ఏర్పాటుకు సహకరించాలని రైతులు కోరగా కలెక్టర్ వెంటనే పీఏసీఎస్ సీఈఓ బాల్ రెడ్డికి ఫోన్ చేసి షెడ్, రైతులకు విశ్రాంతి రూమ్ ల ఏర్పాటుకు రూ.10 లక్షలు కేటాయించాలని ఆదేశించారు. ప్రభుత్వ స్థలంలో ఈజీఎస్ కింద మొక్కలు పెట్టారని, గతంలో ఇక్కడ పేదలు గుడిసెలు వేశారని, మార్కెట్ షెడ్ ఏర్పాట్లు, రైతులు ధాన్యాన్ని ఆరబోసుకునేందుకు స్థలంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి అభ్యంతరనీ తెలుపుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జలాల్‌పురంలో నూతనంగా నిర్మిస్తున్న షెడ్ నిర్మాణంలో ఎవరైనా అడ్డంకులకు గురిచేస్తే అధికారులను వెంటనే సస్పెండ్ చేస్తామని ఎంపీడీఓకు ఫోన్ ద్వారా ఆదేశాలు ఇచ్చారు.

ఎలాంటి సమస్యలు ఉన్నా రైతులు తాసీల్దార్ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా ధాన్యనీ కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలన్నారు. జిల్లాలో మంగళవారం నాటికి 30 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. జిల్లాలో రేపటిలోగా అన్ని కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రైతులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. చివరి గింజ వరకు ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ట్యాబ్ ఎంట్రీ చేసిన 48 గంటల్లో రైతుల ఖాతాలో నేరుగా డబ్బులు జమ అవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్ రెడ్డి, తాసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి శైలజ, ఎం ఆర్ ఐ గుత్తా వెంకట్‌రెడ్డి, ఏఈఓ, నాయకులు ఇబ్రహీంపట్నం అంజయ్య, పిట్ట శ్రీనివాస్ రెడ్డి, తంగేళ్ల దశరథ, శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.

## తెలంగాణలో కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి రావడం అసంభవం.. బాంబు పేల్చిన ఖర్గే



న్యూఢిల్లీ, అక్టోబర్ 21:తెలంగాణలో కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి రావడం అసంభవం.. రేవంత్ రెడ్డికి ముఖ్యమంత్రిగా అవకాశం ఇస్తే సర్వనాశనం చేసిండు.. ఇదేదో ప్రతిపక్షాలు చెప్పిన మాటలు కాదు.. స్వయంగా కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చెప్పిన మాటలు! తనను కలిసిన అసంతృప్త ఎమ్మెల్యేలతో ఖర్గే తన బాధను పంచుకున్నారట. ఈ మేరకు సీనియర్ జర్నలిస్ట్, సౌత్ ఫస్ట్ ఎడిటర్ వాసు సంచలన విషయాలను బయటపెట్టారు.

వివరాల ప్రకారం.. రేవంత్ రెడ్డి గ్యారెంటీల అమలులో ఘోరంగా విఫలం అయ్యాడని ఖర్గే విమర్శించారట. పరిపాలన గాడి తప్పిందని ప్రజలు అనుకుంటున్నారని.. మంత్రుల మధ్య కీచులాటలు, వాటాల పంపకాల లొల్లి కాంగ్రెస్ ప్రభుత్వ ప్రతిష్టను దిగజార్చిందని ఆవేదన చెందారట. బీసీ రిజర్వేషన్ అంశాన్ని రేవంత్ సరిగ్గా హ్యాండిల్ చేయకపోవడం వల్ల మన పరిస్థితి రెండిటికి చెడ్డ రేవడి అయ్యిందని కాంగ్రెస్ ఎమ్మెల్యేల దగ్గర ఖర్గే వాపోయారట.మొదటి నుంచి పార్టీలో అందరినీ కలుపుకొని పోలేదని.. ఇతర పార్టీలతో కూడా సరిగ్గా సమన్వయం చేసుకోలేదని ఖర్గే అన్నారని సమాచారం. ఇప్పుడు బీసీ రిజర్వేషన్ అంశంలో కాంగ్రెస్ ఫెయిల్ అయ్యిందనే సంకేతాలు వెళుతున్నాయని.. అది పార్టీకి తీవ్ర నష్టం చేసిందని తెలిపారట. మొదటి నుండి కాంగ్రెస్ పార్టీకి దన్నుగా ఉన్న రెడ్లు, దళితులు ఈ అంశం వల్ల మనకు దూరం అయ్యారని పేర్కొన్నారట.. పోనీ బీసీలు అయినా మనకు దగ్గర అయ్యారా అంటే అదీ లేదు.. రేవంత్ చేసిన నిర్వాకం వల్ల అన్ని కులాల వాళ్లూ కాంగ్రెస్ మీద ఆగ్రహంగానే ఉన్నారని మండిపడ్డారట. అనవసరంగా రేవంత్ ఇందులోకి రాహుల్ గాంధీ పేరును లాగాడని. ఇది రాహుల్ ఇమేజ్‌ను కూడా డ్యామేజ్ చేసిందని బాధపడ్డారట.

## ఆసిఫ్‌కు 50 వేల రివార్డు.. ఆసిఫ్ సహకారంతోనే కేసును ఛేదించగలిగాం : డీజీపీ శివధర్ రెడ్డి

నిజామాబాద్, అక్టోబర్ 21: నిజామాబాద్‌లో సీసీఎస్ కానిస్టేబుల్ ప్రమోద్ హత్య కేసులో నిందితుడు, ఎన్‌కౌంటర్‌లో మరణించిన రియాజ్ అంత్యక్రియలు పూర్తయిన విషయం తెలిసిందే. అర్ధరాత్రి 2 గంటల సమయంలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం రియాజ్ మృతదేహాన్ని అతని బంధువులకు అప్పగించగా.. మంగళవారం తెల్లవారుజామున అతడి అంత్యక్రియలు నిర్వహించారు.

కాగా నేరస్తుడు రియాజ్‌ను పట్టుకోవడంలో సహకరించిన ఆసిఫ్‌కు 50 వేల రివార్డు ఇస్తున్నామన్నారు డీజీపీ శివధర్ రెడ్డి. ప్రెస్‌మీట్‌లో డీజీపీ మాట్లాడుతూ.. ఆసిఫ్ ప్రాణాలకు తెగించి రియాజ్‌ను పట్టుకున్నాడు. ఆసిఫ్ సహకారంతోనే కేసును ఛేదించగలిగాం. కానిస్టేబుల్ ప్రమోద్ కుటుంబానికి కోటి రూపాయల ఎక్స్ గ్రేషియా ప్రభుత్వం ప్రకటించింది.

ప్రమోద్ భార్యకు ప్రభుత్వ ఉద్యోగంతోపాటు 300 గజాల ఇంటి స్థలం ఇస్తున్నాము. ప్రమోద్ విధి నిర్వహణలో లాయల్టీగా ఉంటూ అందరితో కలిసి మెలిసి ఉండేవారు.

## హరీష్‌కు మంత్రి అడ్లూరి ఛాలెంజ్

హైదరాబాద్, అక్టోబర్ 21: మాజీ మంత్రి హరీష్ రావుకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఛాలెంజ్ విసిరారు. కేబినెట్‌పై బీఆర్ఎస్ నేతలు అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని.. కేబినెట్ సమావేశంలో వ్యక్తిగత అంశాలు చర్చ చేయలేదని తాను ప్రమాణం చేస్తానని మంత్రి స్పష్టం చేశారు. అలాగే ఈ వ్యవహారంపై మాజీ మంత్రికి సవాల్ విసిరారు మంత్రి. 'సిద్దిపేట వెంకటేశ్వర ఆలయంలో ప్రమాణం చేద్దామా హరీష్ సెంటిమెంట్‌గా భావించే దేవుడిపై ప్రమాణం చేయగలడా ఇద్దరం తడిబట్టలతో ప్రమాణం చేద్దామా మా తల్లి తండ్రులపై ప్రమాణం చేసి నేను ప్రమాణం చేస్తాను. నేను ముఖ్యమంత్రి అనుమతి తీసుకొని వస్తాను. నువ్వు (హరీష్) ఆరోపించిన విషయాలను నిజమని ప్రమాణం చేయగలవా ఏ శనివారం వస్తారో హరీష్ రావు చెప్పాలి. ఛాలెంజ్‌ను హరీష్ స్వీకరించాలి. కొండా సురేఖ బిడ్డ.. మా అందరికీ బిడ్డ లాంటిదే' అంటూ మంత్రి అడ్లూరి పేర్కొన్నారు.

హరీష్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కేబినెట్ మంత్రులను దండుపాళ్యం బ్యాచ్ అంటారా అంటూ ఫైర్ అయ్యారు. కేబినెట్లో జరగని విషయాలను జరిగాయని ప్రచారం చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. అబద్ధాలకు కేరాఫ్ అడ్రస్ బీఆర్ఎస్ పార్టీ అంటూ వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు కాంగ్రెస్ సోషల్ మీడియా కార్యకర్తలపై దాదాపు 600 పైగా ఎఫ్ఐఆర్ లు నమోదు చేశారని తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులపై గత ప్రభుత్వం క్రూరంగా ప్రవర్తించిందని విమర్శించారు. రైతుల చేతులకు బేడీలు వేసిన చరిత్ర కేసీఆర్ ప్రభుత్వానిదన్నారు. పదేండ్లు మేమే రాజులం తామే మంత్రులం అన్నట్టు వ్యవహరించారని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ దుయ్యబట్టారు.

## సీసీఎస్ కానిస్టేబుల్ ప్రమోద్ కుటుంబాన్ని పరామర్శించిన డీజీపీ



నిజామాబాద్, అక్టోబర్ 21: రౌడీ షీటర్ రియాజ్ చేతులో మృతి చెందిన సీసీఎస్ కానిస్టేబుల్ ప్రమోద్ కుటుంబాన్ని డీజీపీ శివధర్ రెడ్డి, ఐజి చంద్రశేఖర్ రెడ్డి, సీపీ సాయి చైతన్య పరామర్శించారు. కానిస్టేబుల్ ప్రమోద్ భార్యకు ఆర్థిక సహాయం చెక్కుతో పాటు 300 గజాల ఇంటి స్థలానికి సంబంధించిన డాక్యుమెంట్స్‌ను డీజీపీ అందజేశారు.

ఈ సందర్భంగా కానిస్టేబుల్ ప్రమోద్ భార్య మాట్లాడుతూ.. డీజీపీ సార్ తమ కుటుంబానికి భరోసా ఇచ్చారన్నారు. ఏ సమయంలో ఎలాంటి కష్టం వచ్చినా ఆదుకుంటామన్నా తెలంగాణ ప్రభుత్వంకు ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నా భర్త లేని లోటు తీర్చలేరు కానీ, మా కుటుంబానికి జరిగినట్లు మరో కుటుంబానికి జరుగకుండా టాస్క్‌కు వెళ్ళేటప్పుడు పోలీసులకు వెపన్స్ కల్పించాలని ప్రమోద్ భార్య కోరారు.

అనంతరం, డీజీపీ శివధర్ రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. రియాజ్‌ను పట్టుకోవడంలో పోలీసులకు సహకరించి గాయపడ్డ ఆసీఫ్‌కు రూ. 50 వేల రివార్డు అందించామన్నారు. కానిస్టేబుల్ ప్రమోద్ కుటుంబానికి కోటిరూపాయల ఎక్స్ గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పిస్తున్నట్లు తెలిపారు. రియాజ్ ఎన్ కౌంటర్‌పై విచారణకు ఆదేశించామని, డీఎస్పీ స్థాయి అధికారితో విచారణ చేయిస్తున్నట్లు వెల్లడించారు. తెలంగాణలో 65 మంది మావోయిస్టులు అజ్ఞాతంలో ఉన్నారని, వారందరూ జన జీవన స్రవంతి లోకి రావాలని డీజీపీ శివధర్ రెడ్డి పిలుపునిచ్చారు.

## బీజేపీ మహిళా అభ్యర్థి మెడలో నితీష్ దండ.. తేజస్వి సెటైర్

న్యూఢిల్లీ, అక్టోబర్ 21: బిహార్ అసెంబ్లీ ఎన్నికల వేళ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ బీజేపీకి చెందిన మహిళా అభ్యర్థి మెడలో పూలదండ వేసిన వీడియో ఒకటి ఇప్పుడు వైరల్ అవుతోంది. నితీష్ మానసిక స్థితిపై తరచు విమర్శలు గుప్పించే ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ వెంటనే ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుని ఆయనపై సెటైర్లు గుప్పించారు. 'వాట్ ఏ క్రేజీ గై హి ఈజ్, బ్రో!!' అని కామెంట్ చేస్తూ ఆ వీడియాను షేర్ చేశారు.

వివరాల్లోకి వెళ్తే.. మంగళవారంనాడు జరిగిన అసెంబ్లీ ఎన్నికల ప్రచార ర్యాలీలో వేదికపై నితీష్ కుమార్‌తో పాటు జేడీ(యూ) ఎంపీ సంజయ్ ఝా, బీజేపీ అభ్యర్థి రామా నిషాద్ తదితరులు పాల్గొన్నారు. సంజయ్ ఝా ఒక పూలదండను నితీష్‌కు ఇచ్చి ఆయన చేతుల మీదుగా రామా నిషాద్‌కు ఇవ్వమన్నారు. నితీష్ ఆ దండను ఆమె మెడలో వేసే ప్రయత్నం చేయడంతో ఝా అడ్డుకున్నారు. నితీష్ వెంటనే ఆ దండను ఆమె చేతి వరకూ తీసుకువచ్చి చటుకున్న ఆమె మెడలో వేశారు. సంజయ్ ఝాను ఉద్దేశించి 'గజబ్ ఆద్మీ హై' అంటూనే.. నేనెందుకు ఆమె చేతికి దండ ఇవ్వాలి? అని నవ్వుతూ ప్రశ్నించారు. దీంతో రామా నిషాద్‌తో పాటు అక్కడున్న వారంతా హాయిగా నవ్వుకోవడం కనిపించింది.

ఇందుకు సంబంధించిన వీడియో వైరల్ కావడంతో నితీష్ కుమార్‌పై విపక్షాలు విమర్శలు గుప్పించాయి. ఆయన ఆరోగ్య పరిస్థితిపై ప్రశ్నలు లేవనెత్తారు. ఈ వీడియోను తేజస్వి షేర్ చేస్తూ.. 'వాట్ ఏ క్రేజీ గై హి ఈజ్, బ్రదర్.. ముఖ్యమంత్రి గారూ.. మీ ఆరోగ్యం బాగుంటే రాసిచ్చిన స్పీచ్ ఎందుకు చదువుతున్నారు' అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ సైతం ఈ వీడియోను షేర్ చేసింది. ఒక వ్యక్తి ఆరోగ్యం గురించి కామెండ్ చేయడం సరికాదంటూనే.. నిజంగానే నితీష్ కుమార్ ఆరోగ్యం బాగోలేదా అంటూ ట్వీట్ చేసింది.

నితీష్ ఆరోగ్యంపై తేజస్వి కామెంట్ చేయడం ఇదే మొదటిసారి కాదు. ఇటీవల ఢిల్లీలో జరిగిన ప్రధాని మోదీ కార్యక్రమంలో నితీష్ కుమార్ తన నివాసం నుంచి వర్చువల్‌గా పాల్గొన్నారు. టీవీ స్క్రీన్‌లో మోదీ వైపు చూస్తూ తన రెండు చేతులను జోడిస్తూ నితీష్ ఉండిపోయారు. ఆ వీడియోను తేజస్వి షేర్ చేస్తూ.. నితీష్ ఆరోగ్య పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వాన్ని నడపలేకపోతున్నారన్నది చాలా స్పష్టంగా కనిపిస్తోందంటూ విమర్శించారు. నితీష్ మానసిక పరిస్థితికి ఆయన సన్నిహితులే కారణమా అని ఆ పోస్టులో ప్రశ్నించారు. నితీష్ ఆహారంలో వారు ఏదో కలుపుతున్నట్టున్నారని వ్యాఖ్యానించారు.

## బీఆర్ఎస్ 40 మంది స్టార్ క్యాంపెయినర్స్



హైదరాబాద్, అక్టోబర్ 21:జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కోసం 40 మంది స్టార్ క్యాంపెయినర్స్ నియమించింది బీఆర్ఎస్ పార్టీ. అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీష్ రావు సహా.. 40 మంది సీనియర్ నేతల పేర్లను విడుదల చేసింది. నవంబర్ 11న జరగనున్న ఈ ఉప ఎన్నికల్లో మాగంటి సునీత గోపీనాథ్‌ను అధికారిక అభ్యర్థిగా ప్రకటించిన బీఆర్ఎస్, క్యాంపెయిన్‌ను మరింత బలోపేతం చేయడానికి ఈ చర్య తీసుకుంది.

ఈ జాబితాలో మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, పద్మారావు గౌడ్, మహమూద్ అలీ, పి. సబితా ఇంద్రా రెడ్డి, ఎమ్మెల్యేలు కలేరు వెంకటేష్, ముఠా గోపాల్, మాజీ ఎమ్మెల్యే నలమోతు భాస్కర్ రావు తదితరులు ఉన్నారు.

ఈ నాయకులు రోడ్ షోలు, పబ్లిక్ మీటింగులు, డోర్-టు-డోర్ క్యాంపెయిన్‌ల ద్వారా ఓటర్లను చేరుకుని, పార్టీ అభ్యర్థిని గెలిపించేందుకు కృషి చేస్తారు. కేసీఆర్.. పార్టీ అభ్యర్థికి బీ-ఫారమ్ ఇంకా రూ.40 లక్షల చెక్‌ను అందజేసిన సందర్భంగా, ఈ క్యాంపెయినర్ల జాబితా విడుదల చేసినట్టు పార్టీ వర్గాలు తెలిపాయి.

ఈ ఉప ఎన్నిక కాంగ్రెస్ ప్రభుత్వంపై రిఫరెండమ్‌లా ఉంటుందని కేటీఆర్ స్పష్టం చేశారు. 'కాంగ్రెస్‌లోని 420 హామీలు ఓటర్లను మోసం చేశాయి. బీఆర్ఎస్ పాలనలో రైతులు, కార్మికులు, మహిళలు అందరూ ప్రయోజనాలు పొందారు' అని ఆయన చెప్పుకొచ్చారు.

ఈ క్యాంపెయిన్ ద్వారా బీఆర్ఎస్, సానుభూతి ఫ్యాక్టర్‌ను కూడా ఉపయోగించుకుని, జూబ్లీహిల్స్‌లో విజయం సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. పార్టీ వార్ రూమ్‌ను కూడా ఏర్పాటుచేసి, క్యాంపెయిన్ వ్యూహాలను రూపొందిస్తోంది. ఈ ఎన్నికలు బీఆర్ఎస్ పునరుద్ధరణకు కీలకమైనవిగా మారతాయని పార్టీ నాయకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# ఆరనీకుమా ఈ దీపం కార్తీకదీపం !

## (22 అక్టోబర్ 2025 కార్తీక మాస ప్రారంభ శుభ సందర్భంగా)

బతుకమ్మ పండుగ తర్వాత దసరా సరదాలు కూడా అనుభవించాం. దీపావళి వెలుగుల్లో మన ఇంటికి సంతోష తోరణాలు కట్టాం. అక్టోబర్ 21న ఆశ్వయుజ బహుళ అమావాస్యతో మాసం పూర్తి అవుతున్నది. ఈ రోజు (21 అక్టోబర్ 2025) గుజరాతీల సంవత్సరాదిగా పాటిస్తున్నాం. అక్టోబర్ 21న ఆశ్వయుజ మాసం ముగుస్తూ 22 అక్టోబర్ 2025 రోజున పరమ పవిత్ర కార్తీక మాసం మెదలు అవుతున్నది. "కార్తీక మాసం కన్న పరమ పవిత్ర మాసం లేదని, మహావిష్ణువుకు సమానమైన దేవుడు లేడని, వేదానికి సమానమైన శాస్త్రం ఏదీ లేదని, గంగతో సమానమైన తీర్థం లేదని" స్కంద పురాణం పేర్కొంటున్నది. శివారాధన విశిష్టమైన కార్తీక మాసం 22 అక్టోబర్ నుంచి 20 నవంబర్ 2025 వరకు కొనసాగుతుంది. మహిమాన్వితమైన కార్తీక మాసంలో పరమేశ్వరుడిని విశేష భక్తి శ్రద్ధలతో ఆరాధిస్తాం. దామోదర మాసంగా పిలుచుకునే పండుగగా అశేష భక్తకోటి పారవశ్యంలో మునిగి పూజలు, వ్రతాలు, ఉపవాసాలు, వన భోజనాలతో భక్తి వరదలతో గుడుస్తుంది. కార్తీక మాసంలో సత్యనారాయణ వ్రతాలు, విష్ణుసహస్రనామ పారాయణాలు, లలిత సహస్రనామ పారాయణాలు ఆచరిస్తారు.

శివారాధనల శుభ గడియలు:

ఏడాదిలో తొమ్మిదవ నెలలో వచ్చే కార్తీక మాసంలో శివాలయాల్లో రుద్రాభిషేకాలు, రుద్రపూజలు, లక్ష బిల్వదళ పూజలు, అమ్మవారికి లక్ష కుంకుమార్చనలు లాంటివని విశేషంగా జరుపుకోవడం అనాదిగా వస్తున్నది. శివున్ని పూజించడంతో మరుజన్మ ఉండదని భక్తులు విశ్వసిస్తారు. అశుతోషుడైన పరమ సదాశివుడు కోరిన కోర్కెలను తీర్చి సకల సౌఖ్యాలను కలిగిస్తున్నాడు. కార్తీక మాసంలో పవిత్ర నదిలో స్నానాలు చేయడంతో పాటు 365 ఒత్తులతో దీపారాధనలు చేస్తారు. పరమ పవిత్రంగా భావించే ఉసిరి చెట్టు కింద ఆవు నెయ్యితో దీపం పడతారు. ఈ మాసం దీప దానం చేస్తే చీకట్లు తొలగుతాయని, లక్ష్మీదేవి అనుగ్రహం కలిగి ఆ ఇల్లు సిరి సంపదలతో నిండిపోతుందని ప్రగాఢ విశ్వాసం. తులసి కోటకు పూజలు నిర్వహిస్తారు. పున్నమి వెలుగుల్లో కార్తీక దీపాలను వెలిగించి నదుల్లో, పారే నీటిలో వదులుతారు. సోమవారం కఠిన ఉపవాస దీక్షలు ఆచరిస్తారు. కార్తీక పూజలతో ఈతని బాధలు తొలిగి జన్మజన్మ పాపాలు తొలగి పోతాయని నమ్మకం. దాన ధర్మాలు చేస్తే ఎంతో పుణ్యం వస్తుందని నమ్ముతారు.

కార్తీక మాస విశిష్ట రోజులు:

అక్టోబర్ 22న అన్న కూట్, గోవర్ధన పూజ, బలి ప్రతిపద పండుగ జరుపుకుంటాం. అక్టోబర్ 23న భాయ్ దూజ్, తమ ద్వితీయ, చిత్రగుప్త పూజ, 25న నాగుల చవితి, మానసిక వినాయక చతుర్థి వ్రతం, 26న నాగ పంచమి, 27న కార్తీక మాస తొలి సోమవారం, స్కంద షష్టి,చత్ పూజ, 29న బుధ అష్టమి వ్రతం, కార్తీక వీర్య జయంతి, 30న గోపాష్టమి, మాసిక్ దుర్గాష్టమి, 31న యజ్ఞావల్క జయంతి, అక్షయ వ్రతం, జగద్ధాతి పూజ, నవంబర్ 1న ప్రభోధిని ఏకాదశి, కొస వధ, భీష్మపంచకం, 2న తులసీ వివాహం, వైష్ణవ దేవుత్థాన ఏకాదశి, యోగేశ్వర ద్వాదశి,, 3న విశ్వేశ్వరయ్య వ్రతం, సోమవారం ప్రదోష వ్రతం, వైకుంఠ చతుర్థి, 4న మణికర్ణికా స్నానం, 5న జ్వాలా తోరణం కార్తీక పూర్ణిమ, 10న కార్తీక మూడవ సోమవారం, 15న కార్తీక బహుళ ఏకాదశి, 16న వృశ్చిక సంక్రాంతి, 17న నవంబర్ నాలుగో సోమవారం, 20న పోలి స్వర్గంతో కార్తీక మాసం ముగుస్తుంది.

కార్తీక మాసంలో భక్తులు సక్రమంగా పూజలు చేసి ఆధ్యాత్మిక ప్రయోజనాలను పొంది జీవితంలో శాంతి, సంతోషాలు, శ్రేయస్సు పొందాలని కోరుకుందాం.

-డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# కర్ణాటక, మహారాష్ట్రల ఎస్డీఆర్ఎఫ్‌కు కేంద్ర వాటాలో రెండో విడతగా రూ.1950.80 కోట్ల ముందస్తు విడుదలను ఆమోదించిన కేంద్ర హోం, సహకార మంత్రి శ్రీ అమిత్ షా

న్యూఢిల్లీ, అక్టోబర్ 21:కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్ర ప్రభుత్వాలకు 2025-26 సంవత్సరానికిగాను ఎస్డీఆర్ఎఫ్ కేంద్ర వాటాలో రెండో విడతగా రూ. 1950.80 కోట్లను ముందస్తు విడుదలకు కేంద్ర హోం, సహకార మంత్రి శ్రీ అమిత్ షా ఆమో దం తెలిపారు.

ఈ సంవత్సరం నైరుతి ఋతుపవనాల సమయంలో భారీ వర్షాలు, వరదల కారణంగా ప్రభావితమైన వారికి తక్షణ సహాయాన్ని అంది ంచే విషయంలో ఆయా ప్రభుత్వాలకు మద్దతునిచ్చేందుకు కర్ణాటకకు రూ. 384.40 కోట్లు, మహారాష్ట్రకు రూ.1566.40 కోట్లు మంజూర య్యాయి.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర హోం, సహకార మంత్రి శ్రీ అమిత్ షా మార్గదర్శకత్వంలో వరదలు, కొండచరియలు విరిగిపడటం, భారీ వర్షాల వల్ల ప్రభావితమైన రాష్ట్రాలకు సాధ్యమైనంత సహాయం అందించే విషయంలో కేంద్ర ప్రభుత్వ పూర్తి నిబద్ధతతో ఉంది.

ఈ సంవత్సరం కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ఎస్డీఆర్ఎఫ్ కింద 27 రాష్ట్రాలకు రూ. 13603.20 కోట్లు, ఎన్డీఆర్ఎఫ్ కింద 15 రాష్ట్రాలకు రూ. 2189.28 కోట్లు విడుదల చేసింది. వీటితో పాటు రాష్ట్ర విపత్తు ఉపశమన నిధి (ఎస్డీఎంఎఫ్) నుంచి 21 రాష్ట్రాలకు రూ. 4571.30 కోట్లు, జాతీయ విపత్తు ఉపశమన నిధి (ఎన్డీఎంఎఫ్) నుంచి 09 రాష్ట్రాలకు రూ.372.09 కోట్లు విడుదలయ్యాయి.

వరదలు, కొండచరియలు విరిగి పడటం, భారీ వర్షాలతో ప్రభావితమైన రాష్ట్రాలన్నింటికి అవసరమైన ఎన్డీఆర్ఎఫ్ బృందాలు, భారత సైన్యం, వైమానిక దళం మద్దతుతో సహా తరలింపు విషయంలో అన్ని రకాల సహాయాన్ని కేంద్ర ప్రభుత్వం అందించింది.

ఈ సంవత్సరం ఋతుపవనాల సమయంలో సహా యక, ఉపశమన చర్యల కోసం 30 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో మునుపటి కంటే ఎక్కువగా 199 ఎన్డీఆర్ఎఫ్ బృందాలను కేంద్రం మోహరించింది.

# ట్యూటికోరిన్ ఓడరేవులో 'ఆపరేషన్ ఫైర్ ట్రైల్'లో భాగంగా రూ. 5.01 కోట్ల విలువైన 83,520 చైనా బాణసంచాల అక్రమ రవాణాను నిరోధించిన డీఆర్ఐ.. నలుగురు అరెస్టు

న్యూఢిల్లీ, అక్టోబర్ 21:దీపావళికి ముందు అక్రమ బాణసంచా దిగుమతిని అరికట్టేందుకు డీఆర్ఐ (డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్) ముందస్తు చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా 'ఆపరేషన్ ఫైర్ ట్రైల్' కొనసాగింపుగా ట్యూటికోరిన్ ఓడరేవులో 40 అడుగుల పొడవున్న రెండు కంటైనర్లను పట్టుకుంది. వీటిలో ఉన్న 83,520 చైనా బాణసంచాలను.. ఇంజనీరింగ్ వస్తువులనే తప్పుడు పేరుతో దిగుమతి చేసుకుంటున్నట్లు డీఆర్ఐ గుర్తించింది. రూ. 5.01 కోట్ల విలువైన ఈ అక్రమ వస్తువులను.. వీటిని దాచిపెట్టేందుకు ఉపయోగించిన సిలికాన్ సీలెంట్ తుపాకుల కార్గోతో పాటు స్వాధీనం చేసుకున్నారు.

2025 అక్టోబర్ 14 నుంచి 18 వరకు సమన్వయంతో చేపట్టిన ఆపరేషన్‌లో డీఆర్ఐ అధికారులు ట్యూటికోరిన్ దిగుమతిదారుడిని అరెస్టు చేశారు. దర్యాప్తు అనంతరం చెన్నై, ట్యూటికోరిన్‌లో మరో ముగ్గురు వ్యక్తులను (ముంబయికి చెందిన ఇద్దరు వ్యక్తులతో సహా) అరెస్టు చేశారు. నలుగురికి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు.

విదేశీ వాణిజ్య విధానంలోని ఐటీసీ (హెచ్) వర్గీకరణ ప్రకారం బాణసంచా దిగుమతిపై ఆంక్షలున్నాయి. దిగుమతులు చేసుకోవాలంటే.. పేలుడు పదార్థాలకు సంబంధించిన నియమాలు-2008 ప్రకారం డీజీఎఫ్‌టీ, పెట్రోలియం-పేలుడు పదార్థాల భద్రతా సంస్థ (పీ ఈఎస్ఓ) నుంచి అనుమతి తీసుకోవాలి. అక్రమ దిగుమతి, వేరే వస్తువులుగా చెప్పి దిగుమతి చేసుకోవటం వల్ల విదేశీ వాణిజ్యం, భద్రతా నియమాలు ఉల్లంఘనకు గురవ్వటమే కాకుండా.. వాటికి ఉన్న పేలే స్వభావం వల్ల ప్రజా భద్రత, ఓడరేవు మౌలిక సదుపాయాలకు తీవ్రమైన ప్రమాదం కలిగే అవకాశం ఉంది.

# ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు : ఏడీఏ కరుణశ్రీ



ఖమ్మం, అక్టోబర్ 21:ఖమ్మం జిల్లా వైరా నియోజకవర్గ పరిధిలోని సింగరేణి (కారేపల్లి) మండలంలో మంగళవారం వైరా వ్యవసాయ శాఖ ఏడీఏ తుమ్మలపల్లి కరుణశ్రీ, ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా దుకాణాలలోని సరుకు నిల్వలు, అమ్మకాల రిజిస్టర్లను పరిశీలించారు.

అనంతరం గోడౌన్లలో ఉన్న ఎరువులకు, పీఓఎస్ మిషిన్లలో ఉన్న స్టాకును తనిఖీ చేశారు. ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని దుకాణదారులను హెచ్చరించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో తిరుగుతూ ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు విక్రయించకూడదని అలా ఎవరైనా చేస్తే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అటువంటి వారి గురించి సంబంధిత వ్యవసాయ, పోలీస్ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. రైతులు వ్యవసాయ శాఖచే లైసెన్స్ పొందిన దుకాణాలలోనే ఎరువులను కొనుగోలు చేయాలని సూచించారు. ఆమె వెంట ఏఓ బట్టు అశోక్ కుమార్, ఏఈఓలు ఉన్నారు.

# ఢిల్లీలోని జాతీయ పోలీసు స్మారక చిహ్నం వద్ద అమరవీరులకు నివాళులర్పించిన రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్

న్యూఢిల్లీ, అక్టోబర్ 21:పోలీసు సంస్మరణ దినోత్సవం సందర్భంగా 2025 అక్టోబర్ 21 మంగళవారం నాడు ఢిల్లీలోని జాతీయ పోలీసు స్మారక చిహ్నం వద్ద రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ అమరవీరులకు నివాళులర్పిస్తారు.

1959 అక్టోబర్ 21న లడఖ్‌లో వేడి బుడగ ప్రాంతంలో భారీగా సాయుధులైన చైనా దళాలు దాడి చేయటంతో పది మంది వీర పోలీసులు ప్రాణాలను అర్పించారు. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం అక్టోబర్ 21ను పోలీసు సంస్మరణ దినోత్సవంగా పాటిస్తున్నారు. పోలీసు సంస్మరణ దినోత్సవం- 2018 సందర్భంగా పోలీసులు చేసిన త్యాగాలతో పాటు జాతీయ భద్రత, సమగ్రతను కాపాడటంలో వారు పోషిస్తోన్న అత్యున్నత పాత్రకు గుర్తింపుగా జాతీయ పోలీసు స్మారక చిహ్నాన్ని (ఎన్‌పీఎం) ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ జాతికి అంకితం చేశారు.

ఈ స్మారక చిహ్నం.. పోలీసుల జాతీయ గుర్తింపు, గౌరవం, లక్ష్యాన్ని సాధించటంలో ఐక్యత, ఉమ్మడి చరిత్ర - విధిని తెలియజేస్తోంది. ప్రాణాలను ఫణంగా పెట్టి కూడా దేశాన్ని రక్షించాలనే పోలీసుల నిబద్ధతను కూడా ఇది బలోపేతం చేస్తోంది. ఈ స్మారక చిహ్నంలో 'శౌర్య గోడ' అనే ప్రధాన స్తంభం, ఒక మ్యూజియం ఉన్నాయి. గ్రానైట్‌తో చేసిన 30 అడుగుల ఎత్తైన ఈ ప్రధాన ఏకశిలా స్తంభం.. పోలీసు సిబ్బంది సామర్థ్యం, ధృడత్వం, నిస్వార్థ సేవను సూచిస్తోంది. అమరవీరుల పేర్లతో ఉన్న శౌర్య గోడ.. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి విధి నిర్వహణలో ప్రాణాలను అర్పించిన పోలీసుల ధైర్యం, త్యాగానికి దృఢమైన గుర్తింపుగా నిలుస్తోంది. భారతదేశ పోలీసు చరిత్ర, పరివర్తనను ప్రదర్శించే కేంద్రంగా మ్యూజియం ఉంది. ఈ స్మారక చిహ్నం ఒక పవిత్రమైన యాత్రాస్థలం మాత్రమే కాదు.. పోలీసులతో పాటు ప్రజలకు కూడా ఒక గౌరవమైన ప్రదేశం. సోమవారం మినహా అన్ని రోజులలో ఈ స్మారక చిహ్నాన్ని ప్రజలు సందర్శించవచ్చు. ఈ స్మారక చిహ్నం వద్ద ప్రతి శనివారం, ఆదివారం సాయంత్రం సూర్యాస్తమయానికి ఒక గంట ముందు కేంద్ర సాయుధ పోలీసుల బలగాలు బ్యాండ్ ప్రదర్శన, కవాతు, రిట్రీట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తాయి.

పోలీసు అమరవీరులకు నివాళులర్పించే అక్టోబర్ 21 నాటి పోలీసు స్మారక దినోత్సవాన్ని దేశవ్యాప్తంగా నిర్వహించనున్నారు. ప్రధాన కార్యక్రమం ఢిల్లీలోని జాతీయ పోలీసు స్మారక చిహ్నం వద్ద జరుగుతుంది. ఈ కార్యక్రమానికి నేతృత్వం వహించనున్న రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్.. అక్కడే అమరవీరులకు నివాళులర్పిస్తారు. కేంద్ర సాయుధ పోలీసు దళాలు (సీఏపీఎఫ్), ఢిల్లీ పోలీసులు సంయుక్తంగా కవాతును నిర్వహిస్తారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి (ఎంఓఎస్), పోలీసు నేపథ్యం ఉన్న ఎంపీలు, సీఏపీఎఫ్ లేదా సీపీఓల అధిపతులతో పాటు ఇతరులు స్మారక చిహ్నం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి అమరవీరులకు నివాళులర్పిస్తారు. పదవీ విరమణ చేసిన డైరెక్టర్ జనరల్స్, పోలీసు అధికారులతో పాటు ఇతర ప్రముఖులు కూడా ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు.

పోలీసు అమరవీరులకు నివాళులు అర్పించిన అనంతరం రక్షణ మంత్రి సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడనున్నారు. ఈ సందర్భంగా ఆయన పోలీసులకు ఉన్న సవాళ్లను వివరిస్తారు. వేడి బుడగ వద్ద అమరవీరులకు అంకితం చేసిన వేదిక వద్ద రక్షణ మంత్రి పుష్పగుచ్ఛాన్ని ఉంచటంతో కార్యక్రమం ముగియనుంది. ఈ కార్యక్రమం దూరదర్శన్, పోలీసు వెబ్‌సైట్‌లలో ప్రత్యక్ష ప్రసారం కానుంది. అఖిల భారత రేడియోతో పాటు ఇతర మీడియా సంస్థలు కూడా ఈ కార్యక్రమానికి కవరేజీ ఇవ్వనున్నాయి.

స్మారక కార్యక్రమాల్లో భాగంగా సీఏపీఎఫ్‌లు, సీపీఓలు అక్టోబర్ 22 నుంచి 30 వరకు జాతీయ పోలీసు స్మారక చిహ్నం వద్ద వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తాయి. ఇందులో అమరవీరుల కుటుంబ సభ్యుల సందర్శనలు, పోలీసు బ్యాండ్ ప్రదర్శన, మోటార్ సైకిల్ ర్యాలీలు, అమరవీరుల కోసం పరుగు, రక్తదాన శిబిరాలు, పిల్లలకు వ్యాస రచన-పెయింటింగ్ పోటీలు, పోలీసు సిబ్బంది త్యాగం - శౌర్యం - సేవలను తెలియజేసే వీడియో చిత్రాల ప్రదర్శనలు ఉన్నాయి. దేశవ్యాప్తంగా కూడా పోలీసులు ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

# పత్తి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



ఖమ్మం, అక్టోబర్ 21: అకాల వర్షాలతో పంట నష్టపోయిన పత్తి రైతులకు ప్రభుత్వం నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని సీపీఎం పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్, ఏఐకేఎస్ పాలేరు డివిజన్ నాయకుడు ప్రతాపనేని వెంకటేశ్వర్లు అన్నారు. ఖమ్మం రూరల్ మండలంలోని ఎం.వెంకటాయపాలెం గ్రామంలో వర్షాలకు దెబ్బతిన్న పత్తి పంటలను మంగళవారం రైతు సంఘం ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ.. రైతులు దిగుబడి రాక ఇబ్బందులు పడుతుంటే ప్రకృతి రైతుపై కక్ష కట్టినట్లు పంట చేతికొచ్చే దశలో అధిక వర్షాలు పడటంతో పంట మొత్తం దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎకరాకు 50 వేల రూపాయలు పెట్టుబడి పెడితే కనీసం 20 వేల రూపాయల పంట కూడా చేతికి రాలేదన్నారు. ఎంవీ పాలెం గ్రామానికి చెందిన వేమన వెంకట్రాములు 16 ఎకరాలను కౌలుకు తీసుకుని పత్తి సాగు చేస్తే ఎకరాకు రెండు క్వింటాళ్ల పంట మాత్రమే పండిందని, క్వింటా పత్తి ప్రభుత్వం రూ.7,500 కు కొంటుందని, అయితే తేమ ఉందని రూ.3,500 కే అడుగుతున్నారన్నారు. ఎకరాకు రూ.50 వేల చొప్పున, రూ.8 లక్షల పెట్టుబడి పెట్టినట్లు బాధిత రైతు తీవ్ర నిర్వేదంతో తెలిపాడు.

రైతు సంఘం డివిజన్ నాయకుడు ప్రతాపనేని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకం రైతులను దోపిడీ చేసే పథకంగా మారిందని విమర్శించారు. బీమా పథకం నుండి ప్రభుత్వం తప్పుకోవడంతో, ప్రైవేట్ కంపెనీల చేతుల్లోకి వెళ్లడంతో రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఉరడి సుదర్శన్ రెడ్డి, చావా నాగేశ్వరరావు, మద్ది వెంకట్ రెడ్డి, ఆయా సంఘాల నాయకులు నంద్ర ప్రసాద్, వడ్లమూడి నాగేశ్వరరావు, పాపిట్ల సత్యనారాయణ, ఏపూరి వర కుమార్ పాల్గొన్నారు.

# ఆల్ హమాలీ వర్కర్స్ యూనియన్ మహాసభను జయప్రదం చేయండి : బొట్ల చక్రపాణి



వరంగల్, అక్టోబర్ 21:ఆల్ హమాలీ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ జిల్లా మహాసభను జయప్రదం చేయాలని యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొట్ల చక్రపాణి పిలుపు నిచ్చారు. ఐనవోలుమండలంలోని ఒంటిమామిడిపల్లి హమాలీ వర్కర్స్ తో కలిసి మహాసభ కరపత్రాలను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 26న వెయ్యి స్తంభాల గుడి నుంచి ర్యాలీ ప్రారంభమై టీఎన్జీవోస్ భవన్ అలంకార్ జంక్షన్లో జరిగే మహాసభకు హమాలి కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

ఈ కార్యక్రమంలో దద్దు రాజు, గోనె మల్లయ్య, బరిగెల శ్రావణ్, కోల సుధాకర్, నక్క మల్లేష్, రాజారపు కుమార్, బరిగెల సందీప్, శ్రీకాంత్, జక్కుల రాజు, బరిగెల వంశీ తదితరులు పాల్గొన్నారు.

# నల్లగొండలోని స్వీట్ షాపుల్లో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

నల్లగొండ రూరల్, అక్టోబర్ 21 : తెలంగాణ రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ కమిషనర్ ఆదేశాల మేరకు ఉమ్మడి నల్లగొండ జిల్లా జోనల్ అధికారి వి.జ్యోతిర్మయి ఆధ్వర్యంలో ఆహార భద్రత శాఖ అధికారులు నల్లగొండలోని స్వీట్స్ షాపులు, స్పైసెస్ తయారీ కేంద్రాలు, రిటైల్ యూనిట్స్‌పై మంగళవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా 12 స్వీట్స్ తయారీ కేంద్రాలు, 7 స్పైసెస్ తయారీ, రిటైల్ కేంద్రాల్లో మొబైల్ ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్ ను ఉపయోగించి స్పాట్ టెస్ట్ నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా వంట గదుల్లో పూర్తిగా అపరిశుభ్ర వాతావరణంలో స్వీట్ల తయారీ, పసుపు, కారం ఇతర మసాలా పొడులను ప్రాసెస్ చేయడం, ఫుడ్ హ్యాండ్లర్స్ హెయిర్ క్యాప్స్, గ్లౌజులు ధరించక పోవడం, పురుగులతో, నాణ్యత లోపించిన ముడి సరుకులు ఉపయోగించడం, గోడలు, పైకప్పు పై నూనెతో కూడినటువంటి దుమ్ము ధూళి పేరుకు పోవడం వంటివి గుర్తించి సంబంధిత 17 స్వీట్ షాప్, స్పైసెస్ దుకాణదారులకు నోటీసులు జారీ చేయడం జరిగింది.

హానికర రసాయనాలతో కూడిన టువంటి రంగులతో చేసినటువంటి సుమారు 48 కిలోల స్వీట్లు, తయారీలో కాలం చెల్లిన ఆహార పదార్థాలను, 5 కిలోల పురుగులు పట్టిన ధనియాల పొడిని అక్కడికక్కడే ధ్వంసం చేశారు. సుమారు 90 కిలోల లేబుల్ లేనటువంటి ఆహార పదార్థాలను, 50 కిలోల పురుగులతో కూడినటువంటి మైదా పిండిని సీజ్ చేసి, 27 అనుమానిత శాంపిల్స్ ను పరీక్ష కోసం ల్యాబ్ కు పంపారు. నివేదిక ఆధారంగా ఆహార కల్తీ నిర్ధారణ అయితే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జ్యోతిర్మయి తెలిపారు. ఆహార కల్తీకి పాల్పడిన వారిని ఉపేక్షించేది లేదన్నారు. ఇకపై ఇలాంటి స్పెషల్ డ్రైవ్స్ తరచూ నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

# గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి : డీడబ్ల్యూఓ కృష్ణవేణి



నల్గొండ, అక్టోబర్ 21:మంచి పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలు తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సాధ్యపడుతుందని నల్లగొండ జిల్లా సంక్షేమ అధికారి (డీడబ్ల్యూఓ) కృష్ణవేణి అన్నారు. మంగళవారం కట్టంగూర్ లోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులతో పాటు భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గర్భిణీలు మంచి పోషకాహారం తీసుకున్నట్లయితే పుట్టబోయే బిడ్డ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా పుడుతారన్నారు. వ్యాధుల బారిన పడకుండా ప్రతిరోజు రోగ నిరోధక శక్తి కలిగిన ఆహార పదార్థాలను తీసుకోవాలని సూచించారు.

గర్భిణీలు నిత్యం అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి వైద్య సిబ్బందితో పరీక్షలు చేయించుకుని, వారి సలహాలు, సూచనలు పాటించాలన్నారు. చిన్నారుల సమగ్ర అభివృద్ధి అంగన్‌వాడీల్లోనే సాధ్యం అన్నారు. మాతా శిశు సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అంగన్‌వాడీ టీచర్లు సమయపాలన పాటించడంతో పాటు గర్భిణీలు, బాలింతలకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని లేనిచో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# వారంలోగా ఆ పని పూర్తిచేయండి.. అధికారులకు కర్ణాటక సీఎం ఆదేశాలు

బెంగళూరు అక్టోబర్ 21: బెంగళూరులో రోడ్ల దుస్థితి గురించి, ట్రాఫిక్ సమస్యల గురించి కొంతకాలంగా కర్ణాటక సర్కారు పై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బయోకాన్ ఛైర్‌పర్సన్ కిరణ్ మజుందార్ షా, ఇన్ఫోసిస్ మాజీ సీఎఫ్‌వో మోహన్‌దాస్ వంటి ప్రముఖులు ఈ సమస్యలను లేవనెత్తారు. ఈ నేపథ్యంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు.

వారం రోజుల లోగా బెంగళూరు రోడ్లపై ఉన్న అన్ని గుంతలను పూడ్చేయాలని సీఎం ఆదేశించారు. నగరంలోని ఐదు కార్పొరేషన్ల పరిధిలోని గుంతల మరమ్మతులకు అక్టోబర్ 31 వరకు గడువు ఇస్తున్నట్లు తెలిపారు. గాంధీనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో వైట్ టాపింగ్ సహా రోడ్ల సమగ్ర అభివృద్ధికి సంబంధించిన ప్రాజెక్టులను ప్రారంభించిన అనంతరం సిద్ధరామయ్య ఈ వ్యాఖ్యలు చేశారు.బెంగళూరు రోడ్ల సమస్యలపై గ్రేటర్ బెంగళూరు అథారిటీ చీఫ్ కమిషనర్ మహేశ్వర్ రావు, ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి, పట్టణాభివృద్ధి శాఖ కమిషనర్ తుషార్ గిరినాథ్ సహా తదితర అధికారులతో చర్చించినట్లు సీఎం తెలిపారు. అయితే ఈ ఏడాది ఎక్కువ వర్షాలు పడడంవల్ల రోడ్లపై పడిన గుంతలను పూడ్చడం ఆలస్యమయ్యిందని పేర్కొన్నారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో రోడ్ల మరమ్మతులు కొనసాగుతున్నాయని, వైట్ టాపింగ్ చేయడంవల్ల రోడ్లు 25 నుంచి 30 ఏళ్లపాటు మన్నికగా ఉంటున్నాయని తెలిపారు.

# మావోయిస్టు తీవ్రవాదాన్ని నిర్మూలించే విషయంలో విజయం సాధిస్తున్న దేశం: ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, అక్టోబర్ 21:ఈ రోజు ఐఎన్ఎస్ విక్రాంత్‌లో దీపావళి వేడుకల సందర్భంగా ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ సాయుధ దళాల సిబ్బందిని ఉద్దేశించి ప్రసంగించారు. ఈ రోజు ఒక అద్భుతమైన రోజు... ఒక అద్భుతమైన క్షణం... ఇది ఒక అద్భుతమైన దృశ్యం అని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు. ఒక వైపు విశాలమైన సముద్రం... మరోవైపు ధైర్యవంతులైన భరతమాత సైనికుల అపారమైన బలం ఇక్కడ ఉందన్నారు. ఒక దిశ అనంతమైన ఆలోచనా పరిధిని... హద్దులులేని ఆకాశాన్ని ప్రదర్శిస్తుండగా, మరొక దిశలో అనంతమైన శక్తి గల ఐఎన్ఎస్ విక్రాంత్ అపార శక్తి ప్రదర్శితమవుతోందని ఆయన పేర్కొన్నారు. సముద్రంపై నుంచి కనిపిస్తున్న సూర్యకాంతి మెరుపులు ధైర్యవంతులైన మన సైనికులు వెలిగించిన దీపాల మాదిరిగా ప్రకాశిస్తూ.. దివ్య దీప మాలను తలపిస్తున్నాయని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. ధైర్యసాహసాలకు మారుపేరైన భారత నావికాదళ సిబ్బందితో కలిసి ఈ దీపావళిని జరుపుకోవడం తనకు దక్కిన గౌరవమని ఆయన ఉద్ఘాటించారు.

ఐఎన్ఎస్ విక్రాంత్‌లో తాను గడిపిన సమయాన్ని గుర్తుచేసుకుంటూ... ఆ అనుభవాన్ని మాటల్లో చెప్పడం కష్టమని ప్రధానమంత్రి అన్నారు. సముద్రంలో చీకటి, ప్రశాంతతలు కలగలిసిన రాత్రి సమయం... అద్భుతమైన సూర్యోదయం వంటి అనుభవాలు ఈ దీపావళిని అనేక విధాలుగా ప్రత్యేకంగా, చిరస్మరణీయంగా మార్చాయని ఆయన తెలిపారు. ఐఎన్ఎస్ విక్రాంత్ తరపున దేశంలోని 140 కోట్ల మంది పౌరులకు ప్రధానమంత్రి హృదయపూర్వక దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

ఐఎన్ఎస్ విక్రాంత్‌ను జాతికి అంకితం చేసిన సందర్భాన్ని గుర్తుచేసుకున్న శ్రీ మోదీ... విక్రాంత్ గొప్పది, అపారమైన శక్తి గలది, విశాలమైనది, ప్రత్యేకమైనది, అసాధారణమైనది అని తాను చెప్పిన మాటలను గుర్తు చేశారు. "విక్రాంత్ కేవలం యుద్ధనౌక కాదు... ఇది 21వ శతాబ్దంలో భారత్ కృషి, ప్రతిభ, ప్రభావం, నిబద్ధతలకు నిదర్శనం" అని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. దేశీయంగా నిర్మించిన ఐఎన్ఎస్ విక్రాంత్‌ను అందుకున్న రోజే భారత నావికాదళం వలస వారసత్వాన్ని త్యజించిందని ఆయన గుర్తు చేశారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ స్ఫూర్తితో భారత నావికాదళం కొత్త జెండాను స్వీకరించిందని ఆయన ప్రధానంగా ప్రస్తావించారు.

"ఈ రోజు ఐఎన్ఎస్ విక్రాంత్ ఆత్మనిర్భర్ భారత్, మేడ్ ఇన్ ఇండియా దార్శనికతలకు శక్తిమంతమైన చిహ్నంగా నిలుస్తోంది" అని ప్రధానమంత్రి ఉద్ఘాటించారు. స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించిన ఐఎన్ఎస్ విక్రాంత్ సముద్రం గుండా దూసుకెళ్తూ భారత సైనిక పరాక్రమాన్ని ప్రతిబింబిస్తోందని స్పష్టం చేశారు. కొద్ది నెలల కిందట విక్రాంత్ అనే పేరు పాకిస్తాన్ నిద్రనూ చెడగొట్టిందని ఆయన గుర్తు చేశారు. ఐఎన్ఎస్ విక్రాంత్ యుద్ధ నౌక పేరు మాత్రమే శత్రువుల దుష్టత్వాన్ని అంతం చేయడానికి సరిపోతుందని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు.

ఈ సందర్భంలో భారత సాయుధ దళాలకు తాను సెల్యూట్ చేస్తున్నానని ప్రధానమంత్రి తెలిపారు. భారత నావికాదళం కలిగించిన భయం... భారత వైమానిక దళం ప్రదర్శించిన అసాధారణ నైపుణ్యం... భారత సైన్యంలోని ధైర్యం... త్రివిధ దళాల మధ్య అసాధారణ సమన్వయం కారణంగానే ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్తాన్ త్వరగా లొంగిపోయిందని ఆయన స్పష్టం చేశారు. ఇందులో పాల్గొన్న వారందరూ నిజంగా అభినందనలకు అర్హులని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు.

శత్రువు ఎదురుగా ఉన్నప్పుడు... యుద్ధం ఆసన్నమైనప్పుడు... స్వతంత్రంగా పోరాడే శక్తి ఉన్న పక్షమే ఎల్లప్పుడూ ప్రయోజనాన్ని కలిగి ఉంటుందని శ్రీ మోదీ పేర్కొన్నారు. సాయుధ దళాలు బలంగా ఉండాలంటే దేశం స్వయం-సమృద్ధి సాధించడం అవసరమని ఆయన స్పష్టం చేశారు. గత దశాబ్ద కాలంలో భారత దళాలు క్రమంగా స్వయం-సమృద్ధి దిశగా పురోగమించడం గర్వకారణంగా ఉందని ప్రధానమంత్రి అన్నారు. ఇకమీదట దిగుమతి చేసుకునే అవసరం లేని వేలాది వస్తువులను సాయుధ దళాలు గుర్తించాయనీ... ఫలితంగా చాలా ముఖ్యమైన సైనిక పరికరాలు ఇప్పుడు దేశీయంగానే తయారవుతున్నాయని ఆయన తెలిపారు. గత 11 సంవత్సరాల్లో భారత రక్షణ ఉత్పత్తి మూడు రెట్లు పెరగడంతో పాటు గత సంవత్సరం రూ. 1.5 లక్షల కోట్లు దాటిందని ప్రధానమంత్రి తెలిపారు. మరొక ఉదాహరణను ఉటంకిస్తూ... 2014 నుంచి భారత షిప్‌యార్డులు 40కి పైగా స్వదేశీ యుద్ధనౌకలు, జలాంతర్గాములను నావికాదళానికి అందించాయని శ్రీ మోదీ పేర్కొన్నారు. ప్రస్తుతం సగటున ప్రతి 40 రోజులకు ఒక కొత్త స్వదేశీ యుద్ధనౌక లేదా జలాంతర్గామి నావికాదళంలో చేరుతున్నట్లు ఆయన తెలియజేశారు.

"ఆపరేషన్ సిందూర్ సమయంలో బ్రహ్మోస్, ఆకాశ్ వంటి దేశీయ క్షిపణులు తమ సామర్థ్యాలను నిరూపించుకున్నాయి. ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు ఇప్పుడు ఈ క్షిపణుల కొనుగోలు పట్ల ఆసక్తి చూపుతున్నాయి'' అని ప్రధానమంత్రి అన్నారు. భారత త్రివిధ దళాలకూ ఆయుధాలు, సామాగ్రిని ఎగుమతి చేసే సామర్థ్యాన్ని భారత్ పెంచుకుంటోందని స్పష్టం చేశారు. "ప్రపంచంలోని అగ్రశ్రేణి రక్షణ ఎగుమతిదారుల్లో ఒకటిగా నిలవడమే భారత్ లక్ష్యం" అని శ్రీ మోదీ ధ్రువీకరించారు. గత దశాబ్ద కాలంలో భారత రక్షణ ఎగుమతులు 30 రెట్లు పెరిగినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ విజయానికి రక్షణ రంగ అంకురసంస్థలు, దేశీయ రక్షణ విభాగాల సహకారమే కారణమన్నారు.

భారత బలం, సామర్థ్యాల సంప్రదాయం ఎల్లప్పుడూ "జ్ఞానాయ దానాయ చ రక్షణాయ" అనే సూత్రంతో ముడిపడి ఉందని ప్రధానమంత్రి పేర్కొన్నారు. ః

అంటే మన శాస్త్రం, శ్రేయస్సు, శక్తి... మానవాళి సేవ, రక్షణకు అంకితమయ్యాయని ఆయన వివరించారు. దేశాల ఆర్థిక వ్యవస్థలు, పురోగతి సముద్ర మార్గాలపై ఎక్కువగా ఆధారపడిన నేటి పరస్పర అనుసంధానిత ప్రపంచంలో... ప్రపంచ స్థిరత్వాన్ని నిర్ధారించడంలో భారత నావికాదళం కీలక పాత్ర పోషిస్తోందని ఆయన స్పష్టం చేశారు. ప్రపంచ చమురు సరఫరాలో 66 శాతం, కార్గో రవాణా 50 శాతం హిందూ మహాసముద్రం గుండానే జరుగుతున్నట్లు శ్రీ మోదీ తెలియజేశారు. ఈ మార్గాల భద్రత కోసం భారత నావికాదళం హిందూ మహాసముద్ర సంరక్షణ బాధ్యతలను చక్కగా నిర్వర్తిస్తోందని ఆయన పేర్కొన్నారు. మిషన్ ఆధారిత విస్తరణలు, యాంటీ-పైరసీ గస్తీ, మానవతా కార్యకలాపాల ద్వారానూ ఈ ప్రాంతం అంతటా భారత నావికాదళం ప్రపంచ భద్రతా భాగస్వామిగా పనిచేస్తోందని ప్రధానమంత్రి తెలిపారు.

''భారత దీవుల భద్రత, సమగ్రతను నిర్ధారించడంలో భారత నావికాదళం గణనీయమైన పాత్ర పోషిస్తుంది" అని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. జనవరి 26న దేశంలోని ప్రతి ద్వీపంలో జాతీయ జెండాను ఎగురవేయాలని కొంతకాలం కిందట తీసుకున్న నిర్ణయాన్ని ఆయన గుర్తు చేసుకున్నారు. ఈ జాతీయ సంకల్పాన్ని నావికాదళం నెరవేర్చిందనీ... ఇప్పుడు ప్రతి భారతీయ ద్వీపంలో నావికాదళం సగర్వంగా త్రివర్ణ పతాకాన్ని ఎగురవేస్తోందని శ్రీ మోదీ తెలిపారు.

భారత్ వేగంగా అభివృద్ధి చెందుతున్న కొద్దీ గ్లోబల్ సౌత్‌లోని అన్ని దేశాలు కలిసి ముందుకు సాగేలా చర్యలు తీసుకుంటున్నట్లు ప్రధానమంత్రి పేర్కొన్నారు. భారత్ 'మహాసాగర్ సముద్ర దార్శనికత'పై పనిచేస్తోందని.. అనేక దేశాలకు అభివృద్ధి విషయంలో భాగస్వామిగా మారుతోందన్నారు. ప్రపంచంలో అవసరం ఎక్కుడున్నా మానవతా సహాయం అందించేందుకు భారత్ సిద్ధంగా ఉందని ప్రధానంగా పేర్కొన్నారు. ఆఫ్రికా నుంచి ఆగ్నేయాసియా వరకు విపత్తు వేళల్లో ప్రపంచ మొత్తం భారత్‌ను సహచర దేశంగా చూస్తోందన్నారు. 2014లో పక్కనే ఉన్న మాల్దీవులు నీటి సంక్షోభాన్ని ఎదుర్కొన్నప్పుడు భారతదేశం 'ఆపరేషన్ నీర్'ను చేపట్టిందని.. ఆ దేశానికి భారత నావికాదళం స్వచ్ఛమైన నీటిని అందించిందని ప్రధాని గుర్తు చేశారు. 2017లో భారీ వరదలతో శ్రీలంక అతలాకుతలమైనప్పుడు భారతే మొదట సహాయ హస్తాన్ని అందించిన విషయాన్ని కూడా ప్రధాని గుర్తుచేశారు. 2018లో ఇండోనేషియాలో సునామీ వచ్చినప్పుడు సహాయక, ఉపశమన చర్యలతో ఆ దేశ ప్రజలకు అండగా నిలబడిందన్నారు. అదే విధంగా మయన్మార్‌లో భూకంపం.. 2019లో మొజాంబిక్, 2020లో మడగాస్కర్‌లో తుఫాన్లు వచ్చినప్పుడు.. ఇలా అన్నిచోట్ల భారత్ సేవాస్ఫూర్తిని కొనసాగిస్తోందని పేర్కొన్నారు.

విదేశాల్లో చిక్కుకున్న వారిని సురక్షితంగా తరలించేందుకు భారత సాయుధ దళాలు ఎప్పటికప్పుడు వివిధ ఆపరేషన్లు నిర్వహించాయని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ పేర్కొన్నారు. యెమెన్ నుంచి సూడాన్ వరకు.. ఎప్పుడైనా ఎక్కడ అవసరం వచ్చినా సాయుధ దళాల శౌర్యం, ధీరత్వం ప్రపంచవ్యాప్తంగా ఉన్న భారతీయుల విశ్వాసాన్ని బలోపేతం చేశాయన్నారు. ఈ మిషన్ల ద్వారా భారత్.. వేలాది మంది విదేశీయుల ప్రాణాలను కూడా కాపాడిందని ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు.

''భారత సాయుధ దళాలు భూమి, సముద్రం, ఆకాశం వంటి అన్ని చోట్ల, అన్ని పరిస్థితిలోనూ దేశానికి సేవ చేశాయి'' అని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. సముద్రాల విషయంలో దేశ సరిహద్దులను, వాణిజ్య ప్రయోజనాలను కాపాడేందుకు నావికాదళం పని చేస్తోందన్న ఆయన.. వైమానిక దళం దేశీయ గగనతలాన్ని రక్షిస్తోందని అన్నారు. అత్యధిక ఉష్ణోగ్రతలతో మండుతున్న ఎడారుల నుంచి మంచుతో నిండిన హిమానీ నదాల వరకూ... బీఎస్ఎఫ్, ఐటీబీపీ, సైన్యం సేవల్ని అందిస్తున్నాయని అన్నారు. వివిధ విభాగాల్లో ఎస్ఎస్‌బీ, అస్సాం రైఫిల్స్, సీఆర్‌పీఎఫ్, సీఐఎస్ఎఫ్, నిఘా సంస్థల సిబ్బంది భారతమాతకు సేవ చేస్తున్నారని వ్యాఖ్యానించారు. జాతీయ భద్రతలో భారత తీర రక్షక దళం పోషిస్తోన్న కీలక పాత్రను ప్రధానమంత్రి ప్రశంసించారు. దేశ తీరప్రాంతాన్ని అన్ని వేళలా సురక్షితంగా ఉంచేందుకు నావికాదళంతో భారత తీర రక్షక దళం నిరంతరం సమన్వయంతో పనిచేస్తోందని తెలిపారు. జాతీయ భద్రత అనే గొప్ప లక్ష్యంలో భద్రతా బలగాల పాత్ర ఎంతో గొప్పదని పేర్కొన్నారు.

భారత భద్రతా దళాల పరాక్రమం, ధీరత్వం కారణంగా వామపక్ష తీవ్రవాదాన్ని నిర్మూలించటమనే ప్రధాన లక్ష్యాన్ని భారత్ సాధించిందని ప్రధానమంత్రి అన్నారు. దేశం ఇప్పుడు నక్సలైట్లు, మావోయిస్టు తీవ్రవాదం నుంచి పూర్తి స్వేచ్ఛ పొందటంలో దాదాపు విజయం సాధించిందని అన్నారు. "2014కి ముందు దాదాపు 125 జిల్లాల్లో వామపక్ష తీవ్రవాదం ఉండేది.. వాటి సంఖ్య నేడు కేవలం 11కు తగ్గింది. వామపక్ష తీవ్రవాదంతో అత్యంత ప్రభావితమైన జిల్లాల మూడు మాత్రమే. 100కు పైగా జిల్లాలు ఇప్పుడు వామపక్ష తీవ్రవాదం నుంచి పూర్తిగా బయటపడి మొదటిసారిగా స్వేచ్ఛా ఊపిరి పీల్చుకొని దీపావళిని జరుపుకుంటున్నాయి" అని మోదీ అన్నారు. తరతరాలుగా భయంతో ఉన్న లక్షలాది మంది ప్రజలు ఇప్పుడు అభివృద్ధి విషయంలో జనజీవన స్రవంతిలోకి వస్తున్నారని ప్రస్తావించారు. ఒకప్పుడు మావోయిస్టులు రోడ్లు, పాఠశాలలు, ఆసుపత్రులు, మొబైల్ టవర్ల నిర్మాణాన్ని అడ్డుకున్న ప్రాంతాల్లో ఇప్పుడు రహదారుల నిర్మాణం జరుగుతోందని, కొత్త పరిశ్రమలు వస్తున్నాయని తెలిపారు. దేశ భద్రతా బలగాల అంకితభావం, త్యాగం, ధీరత్వం ద్వారా ఈ విజయం సాధ్యమైందని అన్నారు. ఇలాంటి అనేక జిల్లాల్లో ప్రజలు మొదటిసారిగా దీపావళిని చేసుకుంటున్నారని ప్రధాని సంతోషం వ్యక్తం చేశారు. జీఎస్టీ పొదుపు ఉత్సవం సందర్భంగా ఆయా ప్రాంతాల్లో రికార్డు స్థాయిలో క్రయవిక్రయాలు జరుగుతున్నాయని తెలిపారు. ఒకప్పుడు మావోయిస్టులు భారత రాజ్యాంగ ప్రస్తావనను అణచివేసిన జిల్లాల్లో... ఇప్పుడు స్వదేశీ మంత్రం ప్రతిధ్వనిస్తోందన్నారు.

భారతదేశం వేగంగా సాధిస్తోన్న పురోగతి, పరివర్తనతో పాటు పెరుగుతోన్న అభివృద్ధి, ఆత్మ విశ్వాసాన్ని ప్రస్తావించిన ప్రధానమంత్రి.. ''భారతదేశం వేగంగా అభివృద్ధి చెందుతూ 140 కోట్ల మంది ప్రజల కలలను నెరవేరుస్తోంది. భూమి నుంచి మొదలుకొని అంతరిక్షం వరకు.. ఒకప్పుడు ఊహకు కూడా అందని విజయాలు ఇప్పుడు వాస్తవ రూపం దాల్చుతున్నాయి" అని అన్నారు. జాతి నిర్మాణం అనే గొప్ప కార్యంలో సాయుధ దళాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. దళాలు కేవలం మూస ధోరణిలో పనిచేయవని, దేశ దశ దిశను నిర్దేశించే సామర్థ్యం, క్లిష్ట సమయాల్లో నడిపించే ధైర్యం, అనంతాన్ని తాకే ధీరత్వం, అసాధ్యాన్ని సుసాధ్యం చేసే స్ఫూర్తి ఉన్నాయని ప్రధానమంత్రి మోదీ వ్యాఖ్యానించారు. మన సైనికులు దృఢంగా నిలబడే పర్వత శిఖరాలను భారత విజయ చిహ్నాలుగా వర్ణించిన ఆయన.. వారి కింద ఉన్న శక్తివంతమైన సముద్ర అలలు దేశ విజయాన్ని ప్రతిధ్వనిస్తున్నాయని వివరించారు. ఈ అన్ని గొంతుకల్లోనూ 'భారత్ మాతా కీ జై!' అనే ఐక్యస్వరం వినిపిస్తోందని అన్నారు. ఈ ఉత్సాహం, దృఢ సంకల్పం మధ్య ప్రధానమంత్రి మరోసారి అందరికీ హృదయపూర్వక దీపావళి శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రసంగాన్ని ముగించారు.

## రైతులు విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి : ఆత్మ కమిటీ చైర్మన్ రామలింగారెడ్డి

మెదక్, అక్టోబర్ 21:రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యదేయమని జహీరాబాద్ ఆత్మ కమిటీ చైర్మన్ రామలింగారెడ్డి తెలిపారు. మంగళవారం జహీరాబాద్ మండలం రంజోల్ రైతు వేదికలో రైతులకు యాసంగి విత్తన పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం పాటు పడుతుందని.. అందులో భాగంగానే రాష్ట్ర వ్యాప్తంగా శనగ, కుసుమ,వేరు శనగ తదితర విత్తనాలను పంపిణీ చేస్తుందని తెలిపారు.

ఇంకా ఉద్యాన శాఖ తరపున కూడా అనేక రాయితీ పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. జహీరాబాద్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు బిక్షపతి మాట్లాడుతూ.. ప్రస్తుతం పంపిణీ చేసిన ధ్రువీకరించడబడిన కుసుమ విత్తనాలను పండించిన తరువాతి పంట కాలానికి మిగతా రైతులకు అందజేయాలని సూచించారు. ఈ విత్తనాన్ని 3 సంవత్సరాల వరకు వాడుకోవచ్చునన్నారు.

ఈ కార్యక్రమంలో జహీరాబాద్ మండల వ్యవసాయ అధికారి లావణ్య వినోద్ కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారి ప్రదీప్ కుమార్, వీరేందర్ శివప్రియ, వరలక్ష్మీ, రైతులు చంద్ర శేఖర్ రెడ్డి, సంజీవ రెడ్డి, రాములు, మహిపాల్, మల్లన్న, సయాద్ అహ్మద్, ప్రభాకర్, వెంకట్ నరసింహ రెడ్డి, వీర రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదవశాత్తు బాత్రూంలో పడి మహిళ మృతి

కరీంనగర్, అక్టోబర్ 21:జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం బతికపల్లి గ్రామానికి చెందిన శ్రీరాం కేత (32) అనే మహిళ మంగళవారం ప్రమాదవశాత్తు బాత్రూంలో పడి మృతి చెందినట్లు ఎస్సై కిరణకుమార్ పేర్కొన్నారు. మండలంలోని రాంబద్రునిపల్లికి చెందిన శ్రీరాం పర్శరాంను వివాహం చేసుకున్న కేత, గత కొంత కాలంగా కాళ్ల నొప్పులతో బాధపడుతున్న కేత రెండు రోజుల క్రితం తల్లిగారి ఇంటికి వచ్చిన్నట్లు చెప్పారు.

నొప్పులకు చికిత్స తీసుకుంటున్న ఆమె సరిగా నడువ లేని స్థితిలో బాత్రూంకు వెళ్లగా, అందులో జారి పడిపోయి అపస్మారక స్థితిలోకి వెళ్లిందని వివరించారు. అది గమనించిన తండ్రి కావటి మల్లయ్య వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం జగిత్యాలకు దవాఖానకు తీసుకెళ్లగా, కేత అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. తహసీల్దార్ ఆనంద్ కుమార్ పంచనామా నిర్వహించగా, తండ్రి మల్లయ్య పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

## 'నాలుగు లేబర్ కోడ్స్ తెచ్చి కార్మికుల పొట్ట కొట్టారు.. సీఐటీయూ మహాసభలను జయప్రదం చేయండి'




మెదక్, అక్టోబర్ 18: సీఐటీయూ తెలంగాణ రాష్ట్ర ఐదవ మహాసభలను విజయవంతం చేయాలని సీఐటీయూ మెదక్ జిల్లా కార్యదర్శి ఏ మల్లేశం పేర్కొన్నారు. టేక్మాల్ మండల పరిధిలోని బొడ్మట్ పల్లి గ్రామంలో మంగళవారం భవన నిర్మాణ కార్మికులతో సీఐటీయూ మహాసభలను విజయవంతం చేయాలని పోస్టర్ ఆవిష్కరించారు. ఈ మహాసభలు డిసెంబర్ 7,8,9వ తేదీల్లో మెదక్ పట్టణంలో జరుగుతాయన్నారు. ఈ సమావేశంలో కార్మికులకు సంబంధించిన అనేక సమస్యలను పరిష్కరించే విధంగా చర్చలు జరుగుతాయన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులపై అవలంబిస్తున్న ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం సీఐటీయూ మాత్రమే పోరాడుతుందన్నారు. ప్రస్తుతం కేంద్రంలో నరేంద్ర మోదీ, రాష్ట్రంలో రేవంత్ రెడ్డి కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను అవలంభిస్తూ ఇన్సూరెన్స్, టెలికాం రంగాలను ప్రైవేటుపరం చేస్తుందన్నారు. బ్యాంకుల్లో సైతం ప్రైవేట్ పెట్టుబడుదారులను పెద్ద ఎత్తున ఆహ్వానించడం సిగ్గుచేటని ఆయన విమర్శించారు.

పార్ట్ టైం ఉద్యోగుల గౌరవ వేతనం పెంచడం లేదు..

నాలుగు లేబర్ కోడ్స్ తెచ్చి కార్మికుల పొట్ట కొట్టారని మల్లేశం గుర్తు చేశారు. తెలంగాణలో ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేసి పబ్బం గడుపుకుంటుందన్నారు. అంగన్వాడి, ఆశ, మధ్యాహ్న భోజన కార్మికులు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లతోపాటు అనేక రంగాల పార్ట్ టైం ఉద్యోగుల గౌరవ వేతనం పెంచడం లేదన్నారు. హక్కుల కోసం ధర్నాలు చేసే వారిపై ఉక్కు పాదం మోపడం ఈ ప్రభుత్వాలకు అలవాటు అయిందని ఆయన విమర్శించారు.

సమ్మె చేయడం కార్మికుల హక్కు..దానిని ఎవరు హరించినాన పాతరేస్తామని మల్లేశం మండిపడ్డారు. కార్మికుల హక్కులను కాపాడుకోవడం తెలంగాణ రాష్ట్రం మొత్తం కార్మికుల ప్రక్షాళ మాట్లాడే వారు డిసెంబర్ 7,8,9, తేదీలలో మెదక్ పట్టణంలో సమావేశమై పరిష్కరించే దిశగా కృషి చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక మండల అధ్యక్షులు లాలు, ఆ సంఘం నాయకులు మల్లేష్, శ్రీనివాస్, సాయిలు, మర్పల్లి మల్లేశం, శివయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఫిలిప్పీన్స్‌తో సాంకేతిక బదిలీ ప్రతినిధి బృందానికి కేంద్ర మంత్రి శ్రీ జయంత్ చౌధరి నాయకత్వం



న్యూఢిల్లీ, అక్టోబర్ 21:ఫిలిప్పీన్స్‌తో సాంకేతిక బదిలీకి సంబంధించిన ఉన్నత స్థాయి ప్రతినిధి బృందానికి కేంద్ర నైపుణ్యాభివృద్ధి, ఔత్సాహిక పారిశ్రామిక శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర) శ్రీ జయంత్ చౌధరి నాయకత్వం వహిస్తున్నారు. 2025, అక్టోబర్ 20 నుంచి 22 వరకుజరిగే ఈ కార్యక్రమానికి ప్రపంచ బ్యాంకు మధ్యవర్తిత్వం వహిస్తోంది.

నైపుణ్యాభివృద్ధి, ఔత్సాహిక పారిశ్రామిక మంత్రిత్వ శాఖలో పనిచేసే ఉన్నతాధికారులు, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, తెలంగాణకు చెందిన ప్రతినిధులు భారతీయ బృందంలో ఉన్నారు.

ఈ పర్యటనలో వలస కార్మికుల విభాగం (డీఎండబ్ల్యూ), సాంకేతిక విద్య, నైపుణ్యాభివృద్ధి సంస్థ (టీఈఎస్‌డీఏ), ఫిలిప్పీన్స్ గణాంకాల సంస్థ (పీఎస్ఏ), ఓవర్సీస్ వర్కర్స్ వెల్ఫేర్ అడ్మినిస్ట్రేషన్ (ఓడబ్ల్యూడబ్ల్యూఏ) లాంటి కీలకమైన ఫిలిప్పీన్ సంస్థలతో వ్యూహాత్మక చర్చలు చేపడతారు.

నైపుణ్యాభివృద్ధి, కార్మికుల తరలింపు, డేటా ఆధారిత తయారీ తదితర అంశాలకు సంబంధించి పరస్పరం సాంకేతిక బదిలీ, ప్రస్తుతం అనుసరిస్తున్న ఉత్తమ పద్ధతులను పంచుకోవడమే లక్ష్యంగా ఈ పర్యటన జరుగుతోంది.

మానవ వనరుల అభివృద్ధిలో, పరస్పర జ్ఞాన సముపార్జనను ప్రోత్సహించడంలో, నైపుణ్యాలు, పారిశ్రామికత ద్వారా సమానమైన, సుస్థిర వృద్ధికి మార్గాలు రూపొందించడంలో అభివృద్ధి చెందుతున్న దేశాలకున్న ఉమ్మడి అంకితభావాన్ని ఈ కార్యక్రమం ప్రతిబింబిస్తుంది.

## శ్మశానంలో దీపావళి

కరీంనగర్, అక్టోబర్ 21:శ్మశానంలోకి అడుగు పెట్టాలంటే చాల మంది భయపడుతూ ఉంటారు. కానీ కరీంనగర్‌లో ఆరు దశబ్దాలకు పైగా శ్మశానంలోనే దీపావళి పండుగను జరుపుకునే సంప్రదాయం కొనసాగుతోంది. పూర్వీకులను స్మరించుకుంటూ తమ కుటుంబీకులను ఖననం చేసిన శ్మశాన వాటికలోని సమాధుల వద్ద దీపాలు వెలిగించి వేడుక చేసుకున్నారు.

కరీంనగర్ జిల్లా కేంద్రం లోని కార్ఖన గడ్డలో ఉన్న హిందు శ్మశాన వాటికలో దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పండగకు



వారం రోజుల ముందే శ్మశాన వాటిక వద్ద సమాధులను శుభ్రం చేసి రంగులు వేశారు. పండగ రోజును సాయంత్రం కుటుంబ సభ్యులంతా సమాధుల వద్దకు చేరుకుని అక్కడే గడిపారు. సమాధుల వద్ద పండుగ జరుపుకుంటే.. తమ వారితో కలిసి ఉన్న భావన వస్తుందని స్థానికులు చెబుతున్నారు.

అందుకోసమే చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా అందరూ తమ పూర్వీకులకు ఇష్టమైన వంటలు కూడా వండి సమాధుల వద్ద నైవేద్యంగా పెట్టారు. పితృ దేవతలకు నైవేద్యాలు సమర్పించిన అనంతరం వారిని స్మరించుకుంటూ వారి సమాధుల వద్ద ఆయా కుటుంబీకులు పూజలు చేశారు.

## ఆత్మకూరు(ఎం) పోలీస్ స్టేషన్‌లో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం



నల్గొండ, అక్టోబర్ 21: సమాజ రక్షణ కోసం తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన పోలీసు అమరులకు పౌర సమాజం ఘన నివాళులర్పించింది. యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) పోలీసులు, నక్సలైట్లు, సిమి ఉగ్రవాదులకు మధ్య జరిగిన పోరులో పలువురు పోలీసులు ప్రాణత్యాగం చేశారు. 2006 ఆగస్టు 18న ఆత్మకూర్ (ఎం) పోలీసు స్టేషన్ పై నక్సలైట్లు దాడి చేశారు. ఈ సంఘటనలో విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ చాంద్ పాషా, ఏఎస్ఐ సుల్తాన్ మొయినుద్దీన్, కానిస్టేబుల్ కరీం, హోంగార్డు లింగయ్య కన్నుమూశారు. అలాగే 2015 ఏప్రిల్ 4న మోత్కూరు మండలం జానకిపురంలో సిమి ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో ఆత్మకూరు (ఎం) ఎస్ఐ సిద్దయ్య, కానిస్టేబుల్ చౌగోని నాగరాజు వీరమరణం పొందారు. వారి త్యాగాలను స్మరించుకుంటూ మంగళవారం పోలీస్ సంస్మరణ దినోత్సవం సందర్భంగా పోలీస్ అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఇన్‌చార్జి ఎస్ఐ సతీశ్ నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ సైదులు, సిబ్బంది మల్లేశ్, సైదా, ప్రియాంక, హుస్సేన్, సుధాకర్, విజయ్ పాల్గొన్నారు.

## జపాన్ కొత్త ప్రధాని సానే తాకాయిచీకి అభినందనలు తెలిపిన ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ, అక్టోబర్ 21:జపాన్ ప్రధానమంత్రి పదవికి సానే తాకాయిచీ ఎన్నికైన సందర్భంగా, ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ హృదయపూర్వక అభినందనలను తెలియజేశారు. 'ఎక్స్'లో ప్రధానమంత్రి శ్రీ మోదీ ఒక సందేశాన్ని పొందుపరుస్తూ భారత్, జపాన్‌ల ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యాన్నీ, ప్రపంచ స్థాయి భాగస్వామ్యాన్నీ మరింత బలపరుచుకోవాలన్న నిబద్ధతను పునరుద్ఘాటించారు.

"సానే తాకాయిచీ.. మీరు జపాన్ ప్రధానమంత్రిగా ఎన్నికైన సందర్భంగా మీకు హృదయపూర్వక అభినందనలు. భారత్, జపాన్‌ల ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యాన్నీ, ప్రపంచ స్థాయి భాగస్వామ్యాన్నీ మరింత బలపరుచుకోవడానికి మీతో కలిసి పనిచేసేందుకు ఎదురుచూస్తున్నా. ఇండో-పసిఫిక్ ప్రాంతం పొడవునా, అంతకన్నా విస్తృత స్థాయిలోనూ శాంతి, సుస్థిరత్వం, సమృద్ధి చిరకాలం కొనసాగేందుకు మన మధ్య సంబంధాలు మరింత ముందుకు వెళ్లడం ఎంతో అవసరం."

## ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ ఆర్చరీ పోటీలకు కేయూ జట్టు ఎంపిక

హనుమకొండ, అక్టోబర్ 21: ఈనెల 24 నుంచి 31 వరకు పంజాబ్‌లోని భటిండా గురుకాశీ యూనివర్సిటీలో జరిగే ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ ఆర్చరీ (పురుషులు, మహిళలు) పోటీలకు విశ్వవిద్యాలయ జట్టును ఎంపిక చేసినట్లు విశ్వవిద్యాలయ స్పోర్ట్స్‌బోర్డు కార్యదర్శి ప్రొఫెసర్ వై.వెంకయ్య తెలిపారు.

ఈ ఎంపికలో ఇండియన్ రౌండ్(పురుషులు): నిర్మల్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి చెందిన టి.సునీల్‌కుమార్, రీకర్వ్ రౌండ్ (పురుషులు): హనుమకొండ కాకతీయ డిగ్రీ కాలేజీకి చెందిన బి.గంగరాజు, తొర్రూరు సమతా డిగ్రీ కాలేజీకి చెందిన చి.త్రిశూల్, భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి చెందిన ఈ.ఆనంద్, కే.అశ్విత్‌దొర, రీకర్వ్ రౌండ్ (మహిళలు) వరంగల్ సి.కే.ఎం. ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీకి చెందిన తన్వీర్ కౌసర్, కాంపౌండ్ రౌండ్ (మహిళలు) వరంగల్ పద్మావతి డిగ్రీ కాలేజీకి చెందిన మన్నురహ హసిభా, ఈ బృందానికి కోచ్-కమ్-మేనేజర్‌గా హనుమకొండ న్యూసైన్స్ డిగ్రీ కాలేజీ వ్యాయామ అధ్యాపకుడు వి.రాజేష్ వ్యవహరిస్తారు.

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ గెలుపు ఖాయం : ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి




హైదరాబాద్, అక్టోబర్ 21: జూబ్లీహిల్స్‌లో జరుగనున్న ఉప ఎన్నిల సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి, దివంగత నేత మాగంటి గోపీనాథ్ సతీమణి మాగంటి సునీత తరపున ప్రచారంలో నర్సాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, పటాన్చెరువు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి , పటాన్ చెరువు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలోని 101వ డివిజన్ ఎర్రగడ్డ, 385 బూత్ పరిధిలో బూత్ ఇంచార్జ్‌లు సత్యనారాయణ, సందీప్ గిరి గోస్వామి, ఐలాపూర్ మాణిక్ యాదవ్ ఓబజ యువసేన సభ్యులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

ఈ సందర్భంగా కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని సామాజిక వర్గాలకు న్యాయం జరిగేలా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రారంభించి, బడుగు బలహీన వర్గాలకు అండగా నిలిచిన ఏకైక ప్రభుత్వం కేసీఆర్ హయాంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం మాత్రమేనన్నారు. చేతకాని కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు విసిగిపోయి ఉన్నారని, ఇక నుంచి ఫార్మాట్ ఏదైనా ప్రతీ ఎన్నికల్లో విజయం సాధించేది బీఆర్ఎస్ పార్టీనే అని ధీమా వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో ఎర్రగడ్డ 385 బూత్ ఇంచార్జీ లు సత్యనారాయణ, సందీప్ గిరిగో స్వామి , ఐలాపూర్ మాణిక్ యాదవ్, బీఆర్ఎస్ పార్టీ బండ్లగూడ టౌన్ ప్రెసిడెంట్ భరత్ కుమార్,అజ్జు అజ్మత్ తదితరులు పాల్గొన్నారు.

# మోసాన్ని పసిగట్టిన బీహెచ్ఈఎల్ విజిలెన్స్

కరీంనగర్, అక్టోబర్ 21: రామగుండం ఎన్టీపీసీ తెలంగాణ థర్మల్ ప్రాజెక్టు స్టేజ్-1 నిర్మాణం పనుల్లో 35 కోట్ల రూపాయల దుర్వినియోగం జరిగిందన్న అంశం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రధాన చర్చకు దారితీస్తుంది. 2017 -22 మధ్యకాలంలో జరిగిన నిర్మాణం పనుల వ్యవహారంలో కోట్లాది రూపాయలు దుర్వినియోగం జరిగిందన్న విషయాన్ని బీహెచ్ఈఎల్ విజిలెన్స్ విభాగం పసిగట్టిన నేపథ్యంలో దుర్వినియోగం కథా కమామిషు అంతా కూడా సెంట్రల్ బ్యూరో ఇన్వెస్టిగేషన్ (సిబిఐ) చెంతకు చభారీ మొత్తంలో నిధులు దుర్వినియోగం జరిగిన అంశాన్ని సీబీఐ కేసులు నమోదు చేసిన వ్యవహారం ప్రస్తుతం హాట్ టాపిక్ గా మారింది. తెలంగాణ స్టేజ్ 1 నిర్మాణం సమయంలో బీహెచ్ఇఎల్‌లో నిధులు దుర్వినియోగం అయ్యాయని? బీహెచ్ఈ ఎల్ అడిషనల్ జనరల్ మేనేజర్ విజిలెన్స్ హరీష్ కుమార్ గుప్తా(ఊజీతీతిబష్త్ర ఐబీఎజీతీ ఉ బీజూబిజీ) సీబీఐకి ఫిర్యాదు చేశారు. దీంతో పలువురు అధికారులపై సీబీఐ కేసులను నమోదు చేసి విచారణను ప్రారంభించిన అంశం అలజడిని రేకెత్తిస్తుంది.

ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం లో తెలంగాణలో విద్యుత్ సమస్యలు అధిగమించేందుకు 4000 మెగావాట్ల ప్రాజెక్ట్ రామగుండంలో నిర్మిస్తామని పునర్విభజన చట్టంలో పొందుపరిచారు. అందులో భాగంగానే రామగుండం తెలంగాణ స్టేజ్ వన్ 1600 మెగావాట్ల పనుల నిర్మాణాలకు టెండర్లను ఆహ్వానించింది.

ఈ నిర్మాణం పనుల్లో ప్రాజెక్ట్ బాయిలర్‌పనులు దక్కించుకున్న బీహెచ్ఈఎల్ నిర్మాణం పనులను బ్రిడ్జి అండ్ రూఫ్ కంపెనీ(ఃతీతిటణవ జీనిట ఖీనీనీట అనీఎజూజీనిఎ) ఇండియా లిమిటెడ్, పవర్‌మ్యాక్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలకు అప్పగించగా సదరు కంపెనీలు చేపట్టిన నిర్మాణం పనుల్లో సంస్థకు నష్టం జరిగిందని బీహెచ్ఇఎల్ కంపెనీ పసిగట్టి ఈ అంశాన్ని సంస్థ బీహెచ్ఈఎల్ విజిలెన్స్ విభాగానికి అప్పగించడంతో అప్పుడు జరిగిన క్షేత్రస్థాయి పరిశీలనలో సుమారుగా 35 కోట్ల రూపాయల నిధులు దుర్వినియోగం అయినట్లు నిర్ధారణ చేసుకుంది.

ఇందులో మరో విషయం ఏంటంటే.. సదరు సొంత సంస్థ బీహెచ్ఇఎల్ కంపెనీకి చెందిన అధికారులే ఇతర కంపెనీల అధికారులతో కుమ్మక్కై నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్లు తమ క్షేత్రస్థాయి విచారణలో తేటతెల్లమైన నేపథ్యంలో బీహెచ్ఇఎల్" సంస్థ సీబీఐని ఆశ్రయించింది.

ఇదిలా ఉండగా నిధుల దుర్వినియోగానికి బీహెచ్ఇఎల్ విజిలెన్స్ విభాగం జనరల్ మేనేజర్ హరీష్ కుమార్ గుప్తా హైదరాబాదులో సీబీఐకి ఫిర్యాదు చేయగా అక్టోబర్ 14న సీబీఐ పలువురు అధికారులపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కోట్లాది రూపాయల నిధుల దుర్వినియోగానికి సంబంధించిన వ్యవహారాన్ని సీబీఐ పూర్తిస్థాయిలో విచారణ చేపట్టిన అనంతరం దుర్వినియోగానికి అసలు సూత్రధారులు ఎవరనేది బహిర్గతం కానుంది.

# ప్రజలకే కాదు.. పెద్దలకు నమ్మకం లేకుండా పోయింది : వై సతీశ్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 21: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ పని అయిపోయిందనేది స్వయంగా ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు ఖర్గేనే ఒప్పుకున్నారని.. తెలంగాణలో రేవంత్ రెడ్డి మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారని రెడ్కో మాజీ చైర్మన్ వై సతీశ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలను, చివరకు వాళ్ల పార్టీ అగ్ర నాయకులను కూడా మభ్యపెట్టే ప్రయత్నాల్లో రేవంత్ రెడ్డి బిజీగా ఉన్నారన్నారు. తెలంగాణ ప్రజలను మోసం చేసినట్టే.. పార్టీ అగ్ర నాయకులను మోసం చేద్దామని చూశారు. కానీ, అట్టర్ ఫ్లాప్ అయ్యారని.. అందుకే.. తెలంగాణలో మళ్లీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చే అవకాశం లేకుండా పోయిందని పార్టీ జాతీయ అధ్యక్షుడికి అర్థమైపోయిందన్నారు.

అందుకే రేవంత్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ పూర్తిగా వదిలేసిందని.. ఇక జీవితంలో మళ్లీ తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చే అవకాశాలు ఏ కోశానా కనిపించడం లేదని ఢిల్లీకి కూడా తెలిసిపోయిందన్నారు. అందుకే ఇక్కడ మీనాక్షి నటరాజన్.. రేవంత్ రెడ్డికి సమాంతరంగా మరో ప్రభుత్వాన్ని నడిపిస్తున్నట్టుగా అర్థమవుతోందని.. గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేసి.. ఈ వర్గం, ఆ వర్గమని లేకుండా అన్ని వర్గాలను మోసం చేసింది కాంగ్రెస్ పార్టీ అని ఆరోపించారు. రేవంత్ రెడ్డి చేస్తున్న మోసాలు.. మాట్లాడుతున్న చిల్లర మాటలతో ప్రజలు పూర్తిగా విసిగిపోయారని.. రేవంత్ పేరు వినబడితేనే ఛీ.. అనే పరిస్థితి వచ్చిందన్నారు. రెండేళ్లలోనే ప్రజల నుంచి ఇంత వ్యతిరేకత రావడంతో ఇక్కడ తమ పార్టీ పని అయిపోయిందని స్వయంగా ఖర్గేకే అవగతమైందని.. ఇప్పుడు మిగతామూడేళ్లు కూడా ప్రభుత్వం ఉంటుందో ఊడిపోతుందో తెలియని పరిస్థితి ఏర్పడిందన్నారు.

కాంగ్రెస్‌లోని మంత్రులు, ఎమ్మెల్యేల తిరుగుబాటుతో కాంగ్రెస్ సర్కారు పరిస్థితి తుమ్మితే ఊడిపోయే ముక్కులా మారిందని.. అందుకే ప్రజా సంక్షేమాన్ని పక్కనపెట్టి.. అక్రమ సంపాదన మీద కాంగ్రెస్ నాయకులు ఫోకస్ పెట్టారన్నారు. కిందిస్థాయి నాయకుల నుంచి ముఖ్యమంత్రి వరకు అందినకాడికి దోచుకుంటున్నారని.. మళ్లీ అవకాశం రాదని.. ఇప్పుడే భారీగా సంపాదించుకోవాలని తెలంగాణను తెగనమ్ముతున్నారని విమర్శించారు. అందుకే కావొచ్చు రేవంత్ రెడ్డి పూర్తిగా బీజేపీకి దగ్గరై, మోదీ ఆదేశాల ప్రకారం.. మోదీ విధానాలను అమలు చేస్తున్నట్టుగా కనిపిస్తోందని.. రేవంత్ సర్కారు ఎన్ని స్కాములు చేసినా, ఆయన కేబినెట్‌లోని మంత్రులు, వారి అనుచరులు ఎన్ని స్కాములు చేసినా.. కేంద్ర విచారణ సంస్థలు పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

# బస్తీ దవాఖానలకు సుస్తీ పట్టింది: హరీశ్ రావు



హైదరాబాద్, అక్టోబర్ 21: కేసీఆర్‌పై కోపంతో కేసీఆర్ కిట్‌లు తీసేయడంతో పేదలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. పేదల ఆరోగ్యంపై రేవంత్‌కు శ్రద్ధ లేదని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో బస్తీ దవాఖానలకు సుస్తీ పట్టిందని మండిపడ్డారు. శేరిలింగంపల్లిలో బస్తీ దవాఖానను హరీశ్ రావు పరిశీలించారు. ఈ సందర్భంగా దవాఖానలో సదుపాయాలను పరిశీలించారు. ఏఏ మందులు అందుబాటులో ఉన్నాయి, వైద్య పరికరాలు పనితీరు, వైద్య సేవల వివరాలను డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. జీతాలు అందుతున్నాయా అని సిబ్బందిని అడగడంతో.. నాలుగు నెలలుగా జీతాలు రావడం లేదని తమ కష్టాలను హరీశ్ రావుతో చెప్పుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ సర్కార్ బస్తీ దవాఖానలను నిర్లక్ష్యం చేసిందన్నారు. ప్రభుత్వం ఆరోగ్య శ్రీ బకాయిలు ఇవ్వడం లేదని చెప్పారు. గ్రీన్ చానల్ మాటలకే పరిమితమయిందని విమర్శించారు. ఈహెచ్ఎస్ కింద బకాయిలు విడుదల చేయడం లేదని మండిపడ్డారు. బిల్లులను పెండింగ్ పెట్టడంతో ఆరోగ్య శ్రీ సేవలు నిలిచిపోయే పరిస్థితి వచ్చిందన్నారు.

బస్తీ ప్రజలకు తమ గడప దగ్గరే వైద్యం అందించాలనే ఉద్దేశంతో.. నాడు కేసీఆర్ గారు రాష్ట్రం మొత్తంలో 450 బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేశారు. వాటిలో 110 రకాల మందులను, 134 రకాల టెస్టులను ఉచితంగా చేసేవారు. కానీ 22 నెలల కాంగ్రెస్ పాలనలో బస్తీ దవాఖానాలకే సుస్తీ పట్టుకున్నది. లింగంపల్లిలో ఉన్న బస్తీ దవాఖానా సిబ్బంది తమకు 5-6 నెలల నుండి జీతాలు రావడం లేదని బాధపడుతున్నారు. నిత్యావసరమైన మందులు కూడా అందుబాటులో లేవు. రేవంత్ ప్రభుత్వం చెప్పేది ఒకటి, చేసేది ఒకటి.

సీఎం రేవంత్ రెడ్డి కొత్త వైన్ షాపుల అప్లికేషన్ ఫీజు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షలకు పెంచాదని విమర్శించారు. దరఖాస్తులు తక్కువ వచ్చాయని వారం రోజులు గడువు పెంచిందని మండిపడ్డారు. మద్యం దుకాణాల మీద, ఆదాయం మీద ధ్యాస తప్ప ప్రజల ఆరోగ్యం శ్రద్ధ లేదా అని ప్రశ్నించారు. కేసీఆర్ కిట్ ఎందుకు రావడం లేదని, బస్తీ దవాఖానలో మందులు ఎందుకు లేవని నిలదీశారు. బస్తీ దవాఖానల సిబ్బందికి జీతాలు ఎందుకు వస్తలేవన్నారు. ఒక్కరోజైనా రివ్యూ చేశావా అని రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. మద్యం దుకాణాల గురించి తప్ప గరీబ్ వాళ్ల గురించి రేవంత్ రెడ్డి మాట్లాడటం లేదని మండిపడ్డారు. కాంగ్రెస్ వచ్చినంక నల్లా నీళ్ళకు బిల్లులు వేసి పైసలు కట్టాలి అంటున్నరు. అందుకే కాంగ్రెస్ ప్రభుత్వానికి జూబ్లీహిల్స్ ప్రజలు కర్రు కాల్చి వాత పెట్టాలె. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్తేనే బస్తీ దవాఖానాలు బాగుపడతాయి.

# గిరిజన హాస్టల్ కార్మికుల అరెస్ట్ సరికాదు

## - సీఐటీయూ నాయకుడు అబ్దుల్ నబీ



ఖమ్మం, అక్టోబర్ 21:గత నలభై రోజులుగా వారికి వచ్చే వేతనాల్లో సగానికి తగ్గించి ఇస్తామని జీఓ రిలీజ్ చేసిన ప్రభుత్వంపై నిరసనగా గిరిజన ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న డైలీ వేజ్ ఔట్ సోర్సింగ్ వర్కర్లను పండగ రోజు అరెస్ట్ చేసి పోలీసు స్టేషన్‌లో నిర్బంధించడం సరికాదని సీఐటీయూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నాయకుడు అబ్దుల్ నబీ అన్నారు. గత 20 సంవత్సరాలుగా గిరిజన ఆశ్రమ పాఠశాలలో పని చేస్తున్న కార్మికులను దీపావళి పండగ రోజున ఇల్లెందు పోలీసులు స్టేషన్‌లో నిర్బంధించి, పండగపూట ఇబ్బంది పెట్టడం సరికాదని, వారి న్యాయమైన సమస్యలను తీర్చాలన్నారు. నిరవధిక సమ్మె 40 రోజుల నుంచి చేస్తున్నా ప్రభుత్వం కానీ, ఐటీడీఏ అధికారులు కానీ పట్టించుకోకపోవడం సరికాదని వెంటనే వారి న్యాయమైన కోరికను తీర్చాలని డిమాండ్ చేశారు. అరెస్టయిన వారిలో నాగేశ్వరరావు, స్వామి, రామకల, లక్ష్మణ్, లక్ష్మీనారాయణ, నగేష్, ప్రసాద్, వినోద్ ఉన్నారు.

# రిజర్వేషన్ల కోసం పోరాటాలు



కామారెడ్డి, అక్టోబర్ 22: 42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని కామారెడ్డి జిల్లా సదాశివ నగర్ బీసీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ రోజు మండల కేంద్రంలో బీసీ ఐక్యవేదిక సభ్యులు విలేకరులతో వారు మాట్లాడుతూ.. బీసీల జనాభా ప్రాతిపదికన బీసీ రిజర్వేషన్లు కల్పించాలని అన్నారు.

కొన్ని సంవత్సరాలుగా బీసీ రిజర్వేషన్ల కోసం పోరాటాలు జరుగుతున్నాయని, రాజకీయ లబ్ధి కోసమే బీసీలను వాడుకుంటున్నారని, రిజర్వేషన్లు కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్వహించిన సామాజిక, ఆర్థిక సర్వేలో బీసీల జనాభా 56 శాతానికి పైగా ఉందన్నారు. స్థానిక సంస్థల్లో 50% పరిమితినిఎత్తివేసి బీసీలకు రావలసిన రిజర్వేషన్లుఅమలు చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో బిసి ఐక్యవేదిక అధ్యక్షుడు బొంబాయి మల్లయ్య మాజీ ఎంపీటీసీ పాపనోళ్ల బీరయ్య, మాజీ ఉపసర్పంచ్ వంకాయల రవి, మాజీ వార్డు సభ్యుడు పెసరి సాయిలు, ఐక్యవేదిక సభ్యులు మాణిక్యం దేవదాస్, పోలబోయిన సాయిలు, జోగిని ఎల్లయ్య, కుప్రియాల బాబయ్య, కొత్తింటి నర్సింలు, తోకల సాయిరాం, పున్నం రాజయ్య, డా.గణేష్, ఏంపేట సాయిలు, పోసాని బైరు, తోకల లింగం, దువ్వల భాస్కర్, కొమురయ్య, మంగలి దత్తు, పెద్దొల నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

# ఈ దీపావళికి కానుకగా... ఫాస్టాగ్ వార్షిక పాస్!

న్యూఢిల్లీ, అక్టోబర్ 21:ఈ పండుగ సీజన్‌లో ప్రయాణికులకు సరైన కానుక అవుతుంది. ఇది దేశవ్యాప్తంగా జాతీయ రహదారులు, జాతీయ ఎక్స్‌ప్రెస్‌వేలలో ఏడాది పొడవునా ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రయాణించే వీలు కల్పిస్తుంది. రాజ్‌మార్గయాత్ర యాప్ ద్వారా వార్షిక పాస్‌ను ఎవరికైనా కానుకగా ఇవ్వవచ్చు. యాప్‌లోని 'యాడ్ పాస్' ఎంపికను క్లిక్ చేయడం ద్వారా వినియోగదారులు తాము ఫాస్టాగ్ వార్షిక పాస్‌ను బహుమతిగా ఇవ్వాలనుకునే వ్యక్తి వాహన నంబరు, సంప్రదించు వివరాలను జోడించాలి. సాధారణ ఓటీపీ ధృవీకరణ తర్వాత ఆ వాహనానికి జోడించిన ఫాస్టాగ్‌పై వార్షిక పాస్ యాక్టివేట్ అవుతుంది. ఫాస్టాగ్ వార్షిక పాస్ జాతీయ రహదారిపై ప్రయాణించే వారి కోసం ఎలాంటి ఇబ్బందిలేని, ఆర్థికంగా సరసమైన ప్రయాణ ఎంపికను అందిస్తుంది. దేశవ్యాప్తంగా ఉన్న దాదాపు 1,150 టోల్ ప్లాజాలలో ఇది వర్తిస్తుంది.

రూ. 3,000 వన్-టైమ్ ఫీజు చెల్లింపు ద్వారా ఈ వార్షిక పాస్ ఒక సంవత్సరం చెల్లుబాటును గానీ, 200 టోల్ ప్లాజా దాటడానిగానీ వర్తించడంతోపాటు తరచూ ఫాస్టాగ్ రీఛార్జ్ చేయాల్సిన అవసరాన్ని తొలగిస్తుంది. చెల్లుబాటయ్యే ఫాస్టాగ్ ఉన్న అన్ని వాణిజ్యేతర వాహనాలకు ఈ పాస్ వర్తిస్తుంది. రాజ్‌మార్గయాత్ర యాప్ ద్వారా వన్-టైమ్ ఫీజు చెల్లింపు తర్వాత వాహనానికి అనుసంధానించిన ప్రస్తుత ఫాస్టాగ్‌పై రెండు గంటల్లోపు ఈ వార్షిక పాస్ యాక్టివేట్ అవుతుంది.

2025 ఆగస్టు 15న ప్రారంభమైన ఫాస్టాగ్ వార్షిక పాస్ విధానం మొదటి రెండు నెలల్లోనే దాదాపు 5.67 కోట్ల లావాదేవీలతో ఇరవై ఐదు లక్షల మంది వినియోగదారుల మైలురాయిని అధిగమించింది. ఫాస్టాగ్ వార్షిక పాస్‌కు లభించిన అఖండ స్పందన జాతీయ రహదారి వినియోగదారులకు సాఫీగా, సజావుగా సాగే ప్రయాణ అనుభవాన్ని నిర్ధారిస్తుంది.

# ఆత్మకూర్.ఎస్‌లో మహిళ దారుణ హత్య

**- కారుతో ఢీకొట్టి మహిళ గొంతు కోసిన గుర్తు తెలియని వ్యక్తులు**

**- ఏపూర్ గ్రామం నడిబొడ్డులో ఘటన**

నల్గొండ, అక్టోబర్ 21: పట్టపగలు గ్రామం నడిబొడ్డు నుండి నడిచి వెళ్తున్న మహిళను గుర్తు తెలియని వ్యక్తులు కారుతో ఢీకొట్టారు. కింద పడిన మహిళ గొంతును కత్తితో కోసి దారుణంగా హత్య చేశారు. ఈ దారుణ సంఘటన సూర్యాపేట జిల్లా ఆత్మకూర్.ఎస్ మండలం ఏపూర్ గ్రామంలో మంగళవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొరివి భిక్షమమ్మ (39) తన భర్త కొరివి మల్లయ్యతో ఉన్న తగాదాను పెద్దల సమక్షంలో మాట్లాడి వస్తుంది. గ్రామం నడిబొడ్డున గుర్తు తెలియని వ్యక్తులు వీధిలో నడిచి వస్తున్న భిక్షమమ్మను వెనుక నుండి కారుతో ఢీకొట్టారు. ఆ వెంటనే కిందపడిన మహిళను దుండగులు కత్తితో భిక్షమమ్మ గొంతుపై దారుణంగా పొడిచారు. దీంతో భిక్షమమ్మ అక్కడికక్కడే మృతి చెందింది.

మృతురాలు భిక్షమమ్మ కు తన భర్త కొరివి మల్లయ్యకు గత కొంతకాలంగా గొడవలు కొనసాగుతున్నాయి. మృతురాలి భర్త మల్లయ్య లారీ డ్రైవర్ గా పనిచేస్తున్నాడు. వీరికి ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు భరత్ హైదరాబాదులో మెకానిక్ గా పని చేస్తుండగా చిన్న కుమారుడు ప్రవీణ్ సూర్యాపేటలో చికెన్ సెంటర్ లో పని చేస్తున్నాడు. భిక్షమమ్మకు ఇతరులతో సంబంధం ఉన్నదని భర్త మల్లయ్య, కుటుంబ సభ్యులు తరచూ అనుమానం వ్యక్తం చేస్తూ ఆమెతో గొడవ పడేవారు. ఈ విషయమై పెద్దల వద్ద పలుమార్లు పంచాయతీ చేసి సర్ది చెప్పినట్లు సమాచారం. ఇటీవల సూర్యాపేటకు చెందిన దేశ గురువు భిక్షమమ్మతో చనువుగా ఉండడంపై కుటుంబ సభ్యులు ఇరువురిని మందలించారు.

తీరు మార్చుకోని భిక్షమమ్మను మంగళవారం తన భర్త మల్లయ్య పెద్దల సమక్షంలో మందలించేందుకు స్థానికంగా ఉన్న ఓ పార్టీ కార్యాలయానికి పిలిపించి మాట్లాడాడు. పెద్దలు ఇరువురిని సముదాయించి పంపించిన కొద్దిసేపటికే భిక్షమమ్మ దారుణ హత్యకు గురైంది. సమాచారం తెలుసుకున్న సూర్యాపేట డీఎస్పీ ప్రసన్న కుమార్, సీఐ రాజశేఖర్, ఎస్ఐ శ్రీకాంత్ గౌడ్, క్లూస్ టీమ్‌తో సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతదేహాన్ని సూర్యాపేట హాస్పిటల్‌కు తరలించారు

# మన సరఫరా వ్యవస్థ పూర్తిగా దేశంలోనే ఉండేలా అన్ని రకాల స్వదేశీ సాంకేతికతలను మనమే అభివృద్ధి చేసుకోవాలి: శ్రీ రాజ్‌నాథ్ సింగ్

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 21:రక్షణ తయారీలో స్వావలంబన దార్శనికతను బలోపేతం చేస్తూ, లక్నోలోని బ్రహ్మోస్ ఇంటిగ్రేషన్, టెస్టింగ్ కేంద్రంలో తయారు చేసిన మొదటి విడత బ్రహ్మోస్ క్షిపణులను రక్షణమంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ యోగి ఆదిత్యనాథ్, అక్టోబర్ 18, 2025న, సంయుక్తంగా ప్రారంభించారు. యూపీ డిఫెన్స్ ఇండస్ట్రియల్ కారిడార్‌లో కీలకమైన ఈ అత్యాధునిక కేంద్రాన్ని రక్షణమంత్రి మే 11, 2025న వర్చువల్‌గా ప్రారంభించారు. ఇందులో ఐదు నెలల్లోనే, మొదటి బ్యాచ్ క్షిపణులు మోహరింపునకు సిద్ధం కావడం విశేషం.

రక్షణ మంత్రి ఈ సందర్భంగా మాట్లాడుతూ... బ్రహ్మోస్ కేవలం ఒక క్షిపణి మాత్రమే కాదని, పెరుగుతున్న భారత స్వదేశీ సామర్థ్యాలకు చిహ్నం అని అభివర్ణించారు. "ఈ క్షిపణి ఒక సాంప్రదాయ వార్‌హెడ్‌ను, అధునాతన మార్గనిర్దేశిత వ్యవస్థను కలిగి ఉంది. సూపర్‌సోనిక్ వేగంతో సుదూర లక్ష్యాలను ఛేదించగల సామర్థ్యాన్ని కలిగి ఉంది. వేగం, కచ్చితత్వం, శక్తి కలగలసిన బ్రహ్మోస్ ప్రపంచంలోని అత్యుత్తమ వ్యవస్థలలో ఒకటిగా నిలిచింది. ఇది మన సాయుధ దళాలకు వెన్నెముక" అని ఆయన పేర్కొన్నారు.

ఆపరేషన్ సిందూర్‌లో బ్రహ్మోస్ పాత్రను ప్రస్తావిస్తూ... ఈ క్షిపణి ప్రయోగ దశను దాటి ముందుకు సాగిందని, ఇది జాతీయ భద్రతకు గొప్ప ఆచరణాత్మక నిదర్శనంగా నిలిచిందని శ్రీ రాజ్‌నాథ్ సింగ్, పేర్కొన్నారు. పాకిస్థాన్ భూభాగంలోని ప్రతి అంగుళం ఇప్పుడు బ్రహ్మోస్ పరిధిలోకి వచ్చిందని ఆయన పేర్కొన్నారు. "విజయం మనకు అలవాటుగా మారిందనడానికి ఆపరేషన్ సిందూర్ నిదర్శనం. ఇక మన సామర్థ్యాలను మరింతగా పెంచుకోవాలి. ఆ ఆపరేషన్ కేవలం ఒక ట్రైలర్ మాత్రమే. దాంతో తర్వాత ఏమి జరగవచ్చో పాకిస్థాన్‌కు అర్థమైంది" అని ఆయన అన్నారు.

భారత్ ఇప్పుడు తన భద్రతను పటిష్టం చేసుకుంటూ, రక్షణ, సాంకేతిక రంగాల్లో విశ్వసనీయ భాగస్వామిగా ప్రపంచానికి చాటిచెప్పే స్థితిలో ఉందని రక్షణ మంత్రి స్పష్టం చేశారు. 'మేడ్ ఇన్ ఇండియా' అనేది ఇకపై కేవలం నినాదం కాదని, అదొక అంతర్జాతీయ బ్రాండ్ అని... బ్రహ్మోస్ వంటి విజయాలు నిరూపించినట్టు ఆయన పేర్కొన్నారు. "ఫిలిప్పీన్స్‌కు బ్రహ్మోస్ ఎగుమతి అయినా, భవిష్యత్తులో ఇతర దేశాలతో సహకారం అయినా, భారత్ ఇప్పుడు కేవలం తీసుకునే పాత్రలో కాకుండా, ఇచ్చే పాత్రను పోషిస్తోంది. ఇదే ఆత్మనిర్భర్ భారత్ నిజమైన గుర్తింపు. 2014లో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం ఈ దార్శనికతతోనే తన ప్రయాణాన్ని ప్రారంభించింది. 2047 నాటికి పూర్తిగా అభివృద్ధి చెందిన, స్వావలంబన కలిగిన, ప్రపంచానికి నాయకత్వం వహించడానికి సిద్ధంగా ఉన్న భారతదేశ దార్శనికతను ప్రధాని మోదీ మనకు అందించారు. ఈ ప్రయత్నంలో రక్షణ రంగం పాత్ర నిర్ణయాత్మకంగా ఉంటుంది" అని ఆయన అన్నారు.

గత నెల రోజుల్లో బ్రహ్మోస్ బృందం రెండు దేశాలతో సుమారు రూ. 4,000 కోట్ల విలువైన ఒప్పందాలు కుదుర్చుకుందని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. రాబోయే సంవత్సరాల్లో అనేక దేశాల నిపుణులు లక్నోను సందర్శిస్తారని, నగరాన్ని విజ్ఞాన కేంద్రంగా, రక్షణ సాంకేతిక పరిజ్ఞానంలో అగ్రగామిగా తీర్చిదిద్దుతారని ఆయన పేర్కొన్నారు."వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి బ్రహ్మోస్ లక్నో యూనిట్ వ్యాపారం సుమారు రూ. 3,000 కోట్లుగా, జీఎస్టీ వసూళ్లు సుమారు రూ. 500 కోట్లుగా ఉంటాయి" అని ఆయన తెలిపారు.

మొత్తం రూ. 380 కోట్ల వ్యయంతో 200 ఎకరాల్లో నిర్మించిన బ్రహ్మోస్ ఇంటిగ్రేషన్ అండ్ టెస్టింగ్ ఫెసిలిటీ సెంటర్ గురించి రక్షణ మంత్రి మాట్లాడుతూ, ఈ ప్రాజెక్ట్ కేవలం రక్షణ సౌకర్యం మాత్రమే కాదని, ఉపాధి వృద్ధికి కూడా కొత్త మార్గమని అన్నారు. "ఈ కేంద్రంలో ప్రతి సంవత్సరం సుమారు 100 క్షిపణులు ఉత్పత్తి అవుతాయి. ఉత్తరప్రదేశ్‌లోకి వస్తున్న పెట్టుబడులను, రాష్ట్రంలో సాధిస్తున్న పురోగతిని పరిగణనలోకి తీసుకుంటే, ఈ ప్రాంతం అభివృద్ధి, రక్షణ రెండింటికీ కొత్త శకానికి ప్రతీకగా నిలవడానికి సిద్ధంగా ఉంది" అని ఆయన అన్నారు.

కొన్ని దేశాల నుంచి రక్షణ పరికరాల విడిభాగాల సరఫరాలో సమస్యలు తలెత్తుతున్నాయని వస్తున్న సమాచారాన్ని ప్రస్తావిస్తూ, ఒక పెద్ద ఆయుధ వ్యవస్థను సమీకరించడానికి అవసరమైన వేలాది విడిభాగాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉత్పత్తి చేసే చిన్న పరిశ్రమలను బలోపేతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని, తద్వారా ఇతర దేశాలపై ఆధారపడటాన్ని తగ్గించుకోవచ్చని ఆయన స్పష్టం చేశారు. "సాంకేతిక అభివృద్ధి జరుగుతున్న కొద్దీ, సరఫరా వ్యవస్థ విభిన్నంగా మారుతుంది. ఈ సరఫరా మార్గాలు తరచుగా ఇతర దేశాలతో ముడిపడి ఉంటాయి. ఒకవేళ ఆ వ్యక్తి, సంస్థ లేదా దేశం ఆ విడిభాగాన్ని సరఫరా చేయడానికి నిరాకరిస్తే, మీ ఉత్పత్తి తయారు కాదు. అందుకే విడిభాగాల కోసం మనం ఇతరులపై ఆధారపడాల్సిన అవసరం లేకుండా మన చిన్న పరిశ్రమలను బలోపేతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అత్యాధునిక సీకర్లు అయినా లేదా రామ్‌జెట్ ఇంజన్లు అయినా, మనం అన్ని రకాల సాంకేతిక పరిజ్ఞానాన్ని దేశీయంగా అభివృద్ధి చేసుకోవాలి. తద్వారా మన సరఫరా వ్యవస్థ మన దేశంలోనే ఉంటుంది" అని ఆయన అన్నారు.

చిన్న పారిశ్రామికవేత్తలను రక్షణ వ్యవస్థలో చేర్చడానికి సరైన ప్రాజెక్ట్ ప్రణాళికను రూపొందించాలని రక్షణ మంత్రి పిలుపునిచ్చారు. "పెద్ద కంపెనీలతో పాటు చిన్న పరిశ్రమలు కూడా అభివృద్ధి చెందినప్పుడే ఉత్తరప్రదేశ్ డిఫెన్స్ ఇండస్ట్రియల్ కారిడార్ పూర్తి స్థాయిలో విజయవంతమవుతుంది. భవిష్యత్తులో, యూపీ కేవలం ఒక తయారీ కేంద్రంగా మారడమే కాకుండా, చిన్న, పెద్ద పారిశ్రామికవేత్తలకు ఆవిష్కరణ, ఉపాధికి కొత్త కేంద్రంగా కూడా మారుతుందని నాకు నమ్మకం ఉంది" అని ఆయన అన్నారు.

బ్రహ్మోస్ ఇంటిగ్రేషన్, టెస్టింగ్ ఫెసిలిటీ సెంటర్ వంటి సౌకర్యాలు జాతీయ భద్రతను బలోపేతం చేయడమే కాకుండా ఆర్థిక వ్యవస్థను కూడా పెంచుతాయని రక్షణ మంత్రి అన్నారు. సరఫరా చేస్తున్న క్షిపణుల ద్వారా ప్రభుత్వానికి గణనీయమైన జీఎస్టీ ఆదాయం వస్తోందని, అంటే ప్రతి వ్యవస్థ దేశాన్ని రక్షించడమే కాకుండా ఆర్థిక వ్యవస్థను కూడా బలోపేతం చేస్తుందని ఆయన అన్నారు. "కేవలం ఒక క్షిపణి ఉత్పత్తి ద్వారా వచ్చే పన్నులతో, ప్రభుత్వం అనేక పాఠశాలలను నిర్మించగలదు. అనేక ఆసుపత్రులను ఏర్పాటు చేయగలదు.

# ఆరోగ్యం, బీమా, నిత్యావసర వస్తువులపై పన్నులు తగ్గించడం పౌరులకు పెద్ద ఉపశమనం: శ్రీ గోయల్

న్యూఢిల్లీ, అక్టోబర్ 21:కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్.. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి శ్రీ పీయూష్ గోయల్.. కేంద్ర రైల్వేలు, సమాచార, ప్రసార, ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక మంత్రి శ్రీ అశ్వినీ అశ్వనీ వైష్ణవ్ ఈ రోజు న్యూఢిల్లీలో జీఎస్టీ పొదుపు పండగపై సంయుక్తంగా విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఎర్రకోట నుంచి దీపావళికి ముందు తదుపరి తరం జీఎస్టీ సంస్కరణలు అమలవుతాయని ప్రకటించిన విషయాన్ని శ్రీమతి నిర్మలా సీతారామన్ తన ప్రారంభ ప్రసంగంలో గుర్తుచేశారు.

''ఆయన ప్రకటనకు అనుగుణంగా రేటు తగ్గింపు... ప్రక్రియను సరళీకృతం చేయడం... స్లాబ్‌ల సంఖ్యను నాలుగు నుంచి రెండుకి తగ్గించడం... వర్గీకరణ సంబంధిత సమస్యలను పరిష్కరించడం అన్నీ చాలా ముందుగానే పూర్తయ్యాయి. తదుపరి తరం జీఎస్టీ సంస్కరణలు నవరాత్రి మొదటి రోజు నుంచే అమల్లోకి వచ్చాయి. భారత ప్రజలూ ఈ నిర్ణయాన్ని బాగా స్వీకరించారని నేను భావిస్తున్నాను'' అని శ్రీమతి సీతారామన్ అన్నారు.

"మేం జీఎస్టీ కోసం మార్గాన్ని నిర్దేశించాం... మేం దానిని అమలు చేశాం. ప్రతిపక్షం జీఎస్టీని తీసుకురాలేదు సరికదా కనీసం దానిని ప్రయత్నించే ధైర్యమూ చేయలేదు. ఈ రోజు మనం చేస్తున్నది దిద్దుబాటు చర్య కాదు... వివేచనాత్మక నిర్ణయం. ప్రజలకు సాధ్యమైనన్ని ప్రయోజనాలను అందించే ప్రయత్నంలో కేంద్ర ప్రభుత్వం, జీఎస్టీ కౌన్సిల్ మధ్య సహకారానికి ఇది నిదర్శనం" అని కేంద్ర ఆర్థిక మంత్రి వ్యాఖ్యానించారు.

"వినియోగదారుల ప్రయోజనం కోసమే పన్ను రేట్ల తగ్గింపు నిర్ణయం తీసుకున్నాం. గౌరవనీయ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ మాకు సరిగ్గా అదే చేయాలని మార్గనిర్దేశం చేశారు. 2017 నుంచి ఈ రోజు వరకు మేం దీన్ని నిరంతరం చేస్తూనే ఉన్నాం" అని శ్రీమతి సీతారామన్ అన్నారు.

"సెప్టెంబర్ 22 నుంచి మేం అన్ని వస్తువులపై జోనల్ స్థాయిల ద్వారా సమాచారాన్ని అందుకుంటున్నాం. సవరించిన పన్ను నిర్మాణ ప్రయోజనాలు తుది వినియోగదారులకు చేరుతున్నాయని నిర్ధారించుకోవడానికి మేం 54 ఉత్పత్తుల ధరలను నిశితంగా పరిశీలిస్తున్నాం. తదుపరి తరం జీఎస్టీ ప్రయోజనాలను అన్ని 54 వస్తువులకు పూర్తిగా బదిలీ చేశాం" అని కేంద్ర ఆర్థిక మంత్రి వ్యాఖ్యానించారు.

తదుపరి తరం జీఎస్టీ పరివర్తన కాలంలో ఎంపిక చేసిన 54 ఉత్పత్తులను ఆర్థిక, రెవెన్యూ శాఖలు చురుగ్గా పర్యవేక్షిస్తున్నాయని ఆర్థిక మంత్రి తెలిపారు.

ఈ సంవత్సరం నవరాత్రిని ప్రత్యేకంగా మార్చుతూ సెప్టెంబర్ 22 నుంచి తదుపరి తరం జీఎస్టీ సంస్కరణలు అమలు చేసిన ప్రధానమంత్రి, ఆర్థిక మంత్రికి శ్రీ పీయూష్ గోయల్ తన ప్రారంభ ప్రసంగంలో కృతజ్ఞతలు తెలిపారు. ఈ సంస్కరణ దేశవ్యాప్తంగా సామాన్య ప్రజల్లో, పారిశ్రామిక, వాణిజ్య రంగాల్లో, గృహాల్లో నూతన ఉత్సాహాన్ని, శక్తిని తీసుకువచ్చాయన్నారు. స్వాతంత్ర్యానంతరం చేపట్టిన అతిపెద్ద సంస్కరణగా దీనిని అభివర్ణిస్తూ... పరోక్ష పన్ను వ్యవస్థ 140 కోట్ల మంది భారతీయులను ప్రభావితం చేస్తుందని కేంద్ర మంత్రి తెలిపారు. ప్రత్యక్ష-పరోక్ష పన్నులకు సంబంధించిన చర్యల ద్వారా రూ. 2.5 లక్షల కోట్ల ఉపశమనం కల్పించాలనే నిర్ణయం అపూర్వమైనది.. ఊహకు అందనిది అని శ్రీ గోయల్ వ్యాఖ్యానించారు.

ఈ సంవత్సరం ఫిబ్రవరి 1న ఆదాయపు పన్నులో ప్రకటించిన ప్రధాన ఉపశమనం ప్రజల పొదుపును ప్రోత్సహించడానికి, ఖర్చు చేయదగిన ఆదాయాన్ని పెంచడంలో ఒక ప్రధాన ముందడుగుగా శ్రీ గోయల్ అభివర్ణించారు. ప్రధానమంత్రి మార్గదర్శకత్వంలో గత ఏడాదిన్నర కాలంగా ఆర్థిక మంత్రి సమగ్ర పన్ను సంస్కరణలపై కృషి చేస్తున్నారనీ, ఇది 2025 సెప్టెంబర్ 3న వెలువడిన ప్రకటనతో ముగిసిందని ఆయన అన్నారు.

ఈ సంస్కరణల మల్టిప్లైయర్ ప్రభావం ఇప్పటికే పెట్టుబడి, వ్యాపారం, పరిశ్రమల్లో కనిపిస్తోందని శ్రీ గోయల్ పేర్కొన్నారు. ఇది భారత ఆర్థిక వ్యవస్థలో పెరుగుదలను సృష్టించిందనీ, వినియోగ వ్యయాన్నీ పెంచిందని ఆయన తెలిపారు. మౌలిక సదుపాయాల అభివృద్ధి, నిత్యావసరాలు మరింత సరసమైనవిగా మారినప్పుడు సరఫరా-డిమాండ్ రెండింటి నుంచి లభించిన ప్రోత్సాహం ఆర్థిక వ్యవస్థ వేగంగా వృద్ధి చెందడానికి సహాయపడుతుందన్నారు. ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న పెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ పురోగమిస్తోందని శ్రీ గోయల్ తెలిపారు.

శ్రీ అశ్వినీ అశ్వనీ వైష్ణవ్ తన ప్రారంభ వ్యాఖ్యల్లో భారత ఎలక్ట్రానిక్స్ వ్యవస్థలో గణనీయమైన వృద్ధిని... వినియోగం, పెట్టుబడి, తయారీపై జీఎస్టీ సంస్కరణల సానుకూల బహుళ ప్రభావాలను ప్రముఖంగా ప్రస్తావించారు. రికార్డు స్థాయిలో వినియోగదారుల డిమాండ్, విధాన స్థిరత్వం... వేగంగా విస్తరిస్తున్న తయారీ రంగం ద్వారా భారత ఆర్థిక వ్యవస్థ బలమైన పునాదులను ప్రదర్శిస్తూనే ఉందని కేంద్ర మంత్రి తెలిపారు.

ఈ సంవత్సరం నవరాత్రి సీజన్‌లో ఎలక్ట్రానిక్స్ రంగంలో రికార్డు స్థాయి అమ్మకాలు జరిగాయనీ, గత సంవత్సరంతో పోలిస్తే 20 నుంచి 25 శాతం పెరుగుదల నమోదైందని శ్రీ అశ్వనీ అశ్వనీ వైష్ణవ్ తెలియజేశారు. టెలివిజన్లు, వాషింగ్ మెషీన్ల నుంచి స్మార్ట్‌ఫోన్‌లు, ఎయిర్ కండీషనర్ల వరకు అనేక రకాల ఉత్పత్తులకు అన్ని ప్రధాన రిటైల్ చైన్‌లలో అపూర్వమైన డిమాండ్ నమోదైందని తెలిపారు. ముఖ్యంగా 85-అంగుళాల టెలివిజన్లు పూర్తిగా అమ్ముడయ్యాయనీ... అనేక కుటుంబాలు తమ ఉపకరణాలను కొత్త మోడళ్లకు అప్‌గ్రేడ్ చేసుకున్నాయని ఆయన వివరించారు. ఇది పెరుగుతున్న వినియోగదారుల విశ్వాసం, కొనుగోలు శక్తినీ ప్రతిబింబిస్తుందని శ్రీ అశ్వనీ వైష్ణవ్ తెలిపారు.

జీఎస్టీ సంస్కరణలు ఆర్థిక వ్యవస్థకు నిర్మాణాత్మక స్థిరత్వాన్ని తీసుకువచ్చాయని, ముఖ్యంగా ఆహార ద్రవ్యోల్బణాన్ని తగ్గించడం ద్వారా మధ్యతరగతి కుటుంబాలకు ప్రయోజనం చేకూర్చాయని శ్రీ అశ్వనీ వైష్ణవ్ పేర్కొన్నారు. గత నాలుగు నెలలుగా ఆహార ధరలు ద్రవ్యోల్బణంలో దాదాపు 2 శాతం తగ్గుదల ధోరణిని చూపించాయన్నారు. ఇది ఇంటి కొనుగోలు స్తోమతను నిర్వహించడానికి, స్థిరమైన వినియోగదారుల డిమాండ్‌కు మద్దతునివ్వడానికి సహాయపడిందని శ్రీ అశ్వనీ వైష్ణవ్ వివరించారు. డిమాండ్ పెరుగుదల భారత ఎలక్ట్రానిక్స్ తయారీ రంగంలో రెండంకెల వృద్ధికి ప్రత్యక్షంగా దారితీసిందనీ, దేశవ్యాప్తంగా 25 లక్షలకు పైగా ప్రజలకు ఉపాధి కల్పించిందని శ్రీ అశ్వనీ వైష్ణవ్ అన్నారు. ప్రపంచంలోని అతిపెద్ద వినియోగదారు మార్కెట్లలో ఒకటైన అమెరికాకు స్మార్ట్‌ఫోన్ ఎగుమతుల్లో భారత్ తన పొరుగు దేశాన్నీ అధిగమించిందన్నారు. ఒక ప్రధాన ప్రపంచస్థాయి సంస్థ ఇప్పుడు తన మొత్తం ఉత్పత్తిలో 20 శాతం భారత్‌లోనే ఉత్పత్తి చేస్తోందనీ... ఇది ప్రాధాన్యత గల ప్రపంచ తయారీ గమ్యస్థానంగా భారత్ ఆవిర్భావాన్ని ప్రతిబింబిస్తుందని ఆయన తెలిపారు. డిమాండ్ పెరిగేకొద్దీ పెట్టుబడి పెరుగుతుంది...దీంతో డిమాండ్ కూడా మరింత పెరుగుతుంది... తద్వారా ఆర్థిక వృద్ధిలో పునరావృత చక్రాన్ని ఇది సృష్టిస్తుందని కేంద్ర మంత్రి శ్రీ అశ్వనీ వైష్ణవ్ వివరించారు.

భారత సాంకేతిక వ్యవస్థలో ఒక కీలకమైన విజయాన్ని ప్రస్తావిస్తూ.. సెమీ కండక్టర్ల రంగంలో స్వయం-సమృద్ధి దిశగా భారత్ ప్రయాణంలో కీలక ముందడుగు పడిందని శ్రీ అశ్వనీ అశ్వనీ వైష్ణవ్ తెలిపారు. సీజీ సెమీ, కేన్స్ అనే రెండు సెమీ కండక్టర్ల తయారీ కేంద్రాల్లో ఇప్పటికే ఉత్పత్తి ప్రారంభమైందని శ్రీ అశ్వనీ అశ్వనీ వైష్ణవ్ ప్రకటించారు. ఈ ప్లాంట్లు కార్యకలాపాలను కొనసాగిస్తున్న క్రమంలో భారత సెమీ కండక్టర్ల వ్యవస్థలో కొత్త దశ ప్రారంభమైందన్నారు. భారత్ సాంకేతిక సాధికారతను, స్వయం-సమృద్ధినీ సాధించాలనే ప్రధానమంత్రి దార్శనికతకు ఇది అనుగుణంగా ఉందని కేంద్ర మంత్రి శ్రీ అశ్వనీ వైష్ణవ్ వ్యాఖ్యానించారు.

స్థూల ఆర్థిక డేటాను ప్రస్తావిస్తూ... గత సంవత్సరం దేశపు రూ. 335 లక్షల కోట్ల జీడీపీలో రూ. 202 లక్షల కోట్లు వినియోగం ద్వారా, రూ. 98 లక్షల కోట్లు పెట్టుబడుల ద్వారా వచ్చాయని కేంద్ర మంత్రి వివరించారు. జీఎస్టీ సంస్కరణల ప్రభావం స్పష్టంగా కనిపిస్తోందన్న శ్రీ అశ్వనీ వైష్ణవ్ ... ఈ సంవత్సరం వినియోగం దాదాపు 10 శాతం పెరిగిందనీ, వినియోగదారుల వ్యయం అదనంగా రూ. 20 లక్షల కోట్లు పెరగడం దీనిని ప్రతిబింబిస్తున్నదని వివరించారు. ఈ పెరుగుదల పెట్టుబడుల్లో తదనుగుణమైన పెరుగుదలకు దారితీస్తుందని, వృద్ధి వేగాన్నీ బలోపేతం చేస్తుందని ఆయన తెలిపారు. జీఎస్టీ సంస్కరణలు ఆర్థిక వ్యవస్థలో వినియోగం, పెట్టుబడి మధ్య సంబంధాన్ని ఎలా బలోపేతం చేశాయో ఇది నిరూపిస్తుందని శ్రీ అశ్వనీ వైష్ణవ్ పేర్కొన్నారు.

# కోడలు అనుమానాస్పద మృతి

న్యూఢిల్లీ, అక్టోబర్ 21: పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతాలోని ఆర్జీ కర్ మెడికల్ కాలేజీలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం కేసులో దోషిగా తేలిన సంజయ్ రాయ్ మేనకోడలు అనుమానాస్పద స్థితిలో మరణించింది. కప్‌బోర్డు లో వేలాడుతూ కనిపించింది. ఆమెను హుటాహుటిన ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధృవీకరించారు.

కోల్‌కతాలోని అలీపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోగల విద్యాసాగర్ కాలనీలో ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. సంజయ్ రాయ్ అక్క కుమార్తె అయిన 11 ఏళ్ల బాలిక విద్యానగర్ కాలనీలో ఆరో తరగతి చదువుతోంది. కొన్నేళ్ల క్రితం బాలిక తల్లి ఆత్మహత్య చేసుకోవడంతో తండ్రి తన మరదలును రెండో వివాహం చేసుకున్నాడు.

అప్పటి నుంచి బాలికను సవతి తల్లి, తండ్రి వేదింపులకు గురిచేసున్నారని పోలీసుల విచారణలో స్థానికులు వెల్లడించారు. ఆదివారం రాత్రి నవతితల్లి వటానులు కొనుక్కురావడానికి వెళ్లింది. ఆమె తిరిగి వచ్చేసరికి లోపలి నుంచి గడియపెట్టి ఉంది. ఎంతపిలిచినా పలుకకపోవడంతో ఆమె తలుపులు పగులగొట్టుకుని లోపలికి వెళ్లింది.

అంతా వెతికినా బాలిక జాడ కనిపించకపోవడంతో కప్‌బోర్డులు తీసి చూసింది. ఓ కప్‌బోర్డులో బాలిక వేలాడుతూ కనిపించింది. ఆమెను హుటాహుటిన ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరిశీలించి అప్పటికే మరణించినట్లు ధృవీకరించారు. ఘటనపై పోలీసుల దర్యాప్తు కొనసాగుతున్నది. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

# తెలంగాణలో బీసీలకు న్యాయం చేయాలంటే కేంద్రం బీసీ బిల్లును ఆమోదించాలి

**-పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క డిమాండ్**

హైదరాబాద్ అక్టోబర్ 21 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );తెలంగాణలో బీసీలకు న్యాయం చేయాలంటే కేంద్రం బీసీ బిల్లును ఆమోదించాలని పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా.దనసరి సీతక్క డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్ల కోసం తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని అన్నారు. అందుకే ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేసి, కులగణన ప్రక్రియను ఎక్కడా లోపం లేకుండా పూర్తి చేశామని చెప్పారు. బీసీ రిజర్వేషన్ల పెంపు కోరుతూ అసెంబ్లీలో బిల్లును ఆమోదించామని, అయితే ఆ బిల్లు ఆరు నెలలుగా కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న తెలంగాణ బంద్‌ను ప్రజాభవన్‌లోని మంత్రి సీతక్క నివాసంలో మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, స్పోర్ట్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి శనివారం పర్యవేక్షించారు. అనంతరం ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకున్న మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, స్పోర్ట్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, ఇతర నేతలతో కలిసి బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం నిర్వహించిన ప్రదర్శనలో పాల్గొన్నారు.

# ఆదివాసి సంప్రదాయాలు భావితరాలకు అందించాలి



జైనూర్, అక్టోబర్ 21: కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలంలో మంగళవారం ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి పలు గ్రామాల్లో పర్యటించారు. ఆదివాసిగూడలో జరుగుతున్న గుస్సాడీ దండారి సంబరాల్లో భాగంగా ఆమె రాసిమెట్ట, భూసిమెట్ట దేవుగూడ, జంగాం గ్రామాల్లో జరిగిన దండారి సంబరాల్లో పాల్గొని మహిళలతో దండారి నృత్యాలు చేసి అలరింపజేశారు. ఆయా గ్రామాల్లో దండారీల ఆశీస్సులు తీసుకున్నారు.

దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. దండారీలకు కానుకలు సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోవా లక్ష్మి మాట్లాడుతూ.. ఆదివాసీల సాంప్రదాయాలను భావితరాలకు అందే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు. గుస్సాడీ దండారి లా వేడుకలను ప్రభుత్వం గుర్తించడం జరిగిందని ఆమె అన్నారు.

ఈ వేడుకల్లో బి ఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఇంతియాజులాల, సర్పంచుల సంఘం మాజీ మండల అధ్యక్షులు మడవి భీమ్రావు, ఎంపీటీసీల ఫోరం మాజీ మండల అధ్యక్షులు కుమ్ర భగవంతరావు, తాజా మాజీ సర్పంచులు, బిఆర్ఎస్ నాయకులు, ఆదివాసీ నాయకులు ఆదివాసీలు పాల్గొన్నారు.

# అధ్వాన్న పరిస్థితిలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండల రోడ్లు

**-హ్యూమన్ రైట్స్ సంస్థ చైర్మన్ డా. సీహెచ్ విజయ మోహనరావు**



భద్రాద్రి కొత్తగూడెం అక్టోబర్ 21 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండల రోడ్లు అధ్వాన్న పరిస్థితిలో ఉన్నాయని ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ సంస్థ చైర్మన్ డా,, సీహెచ్ విజయ మోహనరావు పేర్కొన్నారు. నేషనల్ ఎస్ టీ రైట్స్ చీఫ్ దిలీప్ కుమారుడు అధ్యక్షతన ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ సంస్థ సమావేశం జరిగింది. ఈ సమావేశం లో ప్రజలు ఎదుర్కొంటున్న తీవ్రమైన సమస్య గురించి చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూసామాన్యులు, రైతులు, ఉద్యోగస్తులు, వ్యాపారస్తులు, విద్యార్థులు పడుతున్న అగచాట్లు,ఏజెన్సీ ప్రాంతములో బ్రతుకుతున్న గిరిజనులు, దళితులు, ఆయా సామాజిక వర్గం ప్రజలు తీవ్రంగా ఎదుర్కొంటున్న ప్రయాణములు అగచాట్లు అంతా ఇంత కాదన్నారు.రోడ్లు పెద్ద పెద్ద గుంతలు కలిగి తరచు ప్రమాదాలు జరుగుతున్నాయని కమిటీ అభిప్రాయం వ్యక్తం చేసారు.వైద్యం కోసం, ఉద్యోగం, ఇంటర్వ్యూ, పాఠశాలలకు, కళాశాలలకు సమయానికి వెళ్లలేక సతమతమౌతున్న ప్రజల కష్టములు అంతా ఇంత కాదని, దీనికి తోడు వరదలు, గోదావరి ముంపు వలన తీవ్రమైన కష్టములు, ప్రతి రోజు ఇసుక లారీలు సుమారు 400 నుండి 500 అధిక లోడ్ తో నడవటం వలన రోడ్లు తీవ్రముగా దెబ్బతిని, ప్రజలు పడుతున్న కష్టములు భగవంతునికి ముదుతున్నాయని అన్నారు.ప్రభుత్వం, రోడ్లు రవాణా మంత్రిత్వ శాఖలు స్పందించి వెంటనే మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారని అన్నారు. గోదావరి ముంపునకు, వర్షానికి తూరుబాక బ్రిడ్జి వద్ద రిపేర్ వలన వాహనాలు సైడ్ రోడ్ కు దిగి వెళ్తుంటే కూరుకు పోవుట వలన ములకపాడు నుండి ప్రయాణించి భద్రాచలం వెళ్ళటానికి సుమారు 3, 4 గంటల సమయం పడుతుంది. ప్రజలు పడుతున్న కష్టములు ప్రభుత్వం గ్రహించి తగిన మరమ్మతులు చేయవలసినదిగా ఇంటర్నేషనల్ హ్యూమెన్ రైట్స్ కోరుతుందన్నారు. చీఫ్ అడ్వైసర్, వైస్ ప్రసిడెంట్ యేసుజీవం, డిస్ట్రిక్ట్ కోర్డినేటర్స్ పెద్దపుడి కనకరాజు, జి చిరంజీవి, ప్రసిడెంట్ కొట్ర బాబురావు, సెక్రెటరీ తన్వీర్, కృష్ణ, జాయింట్ సెక్రెటరీ తెల్లం శ్రీనివాసు, ట్రేసీర్ మేకల, శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్మీనాయుడు కుటుంబానికి పరిహారం ప్రకటించిన చంద్రబాబు

అమరావతి, అక్టోబర్ 21: నెల్లూరు జిల్లా గుడ్లూరు మండలం దరకనిపాడుకు చెందిన తిరుమలశెట్టి లక్ష్మీనాయుడు హత్యపై ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు స్పందించారు. లక్ష్మీనాయుడు హత్య అమానవీయం, అమానుషమని విమర్శించారు. ఈ హత్య కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని ఆదేశించారు.

రాష్ట్రంలోని శాంతి భద్రతలపై సచివాలయంలో మంగళవారం నాడు చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. హోం మంత్రి వంగలపూడి అనిత, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, కందుకూరు ఎమ్మెల్యే, ఉన్నతాధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. లక్ష్మీనాయుడు హత్య కేసు నిందితులకు కఠిన శిక్ష పడాలన్నారు. ప్రత్యేక ట్రిబ్యునల్ ఏర్పాటు చేసి దర్యాప్తు వేగవంతం చేయాలని సూచించారు.

లక్ష్మీ నాయుడు కుటుంబానికి ప్రభుత్వం తరఫున పరిహారం ప్రకటించారు. లక్ష్మీనాయుడి భార్యకు రెండెకరాల భూమితో పాటు రూ.5 లక్షల నగదు, ఇద్దరు పిల్లలకు రెండెకరాల చొప్పున భూమితో పాటు రూ.5 లక్షల చొప్పున నగదు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయాలని సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారు. లక్ష్మీనాయుడి పిల్లల్ని చదివించే బాధ్యత తమ ప్రభుత్వమే తీసుకుంటుందని తెలిపారు. ఇక కారు దాడిలో గాయపడిన పవన్‌కు నాలుగెకరాలు, రూ. 5లక్షల నగదును, భార్గవ్‌కు రూ. 3లక్షల పరిహారం అందజేస్తామని ప్రకటించారు. ఇక లక్ష్మీనాయుడు హత్య కేసు విచారణ వేగంగా జరిగేలా ఫాస్ట్‌ట్రాక్ కోర్టుకు అప్పగించారు. కేసు విచారణ కోసం ప్రత్యేక పీపీని నియమించాలని ఆదేశించారు.

# పోలీస్ అమరుల త్యాగాలు మరువలేనివి. - జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్



సంగారెడ్డి, అక్టోబర్ 21 (నేటి నిజం ప్రతినిధి): ప్రజల ధన, మాన, ప్రాణ రక్షణలో అహర్నిశలు కృషి చేస్తూ విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేనివని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు.

పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో స్మృతి పరేడ్ నిర్వహించి, అమరవీరుల స్థూపానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య హాజరయ్యారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ గారు అన్నారు ? 1959 అక్టోబర్ 21న లడఖ్ ప్రాంతంలోని హాట్ స్ప్రింగ్ వద్ద సి.ఆర్.పి.ఎఫ్ ఎస్.ఐ. కరమ్ సింగ్ నాయకత్వంలోని 20 మంది భారత జవాన్లపై చైనా ఆర్మీ ఆకస్మిక దాడి చేసి, 10 మంది జవాన్లను హతమార్చిందని గుర్తు చేశారు. ఆ రోజు నుండి విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల స్మారకార్థం ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం (పోలీస్ ఫ్లాగ్ డే)గా జరుపుకుంటున్నామని తెలిపారు.

మన రాష్ట్రంలో గతంలో నక్సలిజం ప్రభావం ఎక్కువగా ఉండటంతో అనేక మంది పోలీసులు ప్రాణాలు కోల్పోయారని, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, అస్సాం వంటి నక్సలిజం ప్రభావిత రాష్ట్రాల్లో కూడా పలువురు జవాన్లు వీరమరణం పొందారని చెప్పారు. జమ్ము-కాశ్మీర్ రాష్ట్రంలో పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులను ఎదుర్కొని అనేక మంది పోలీసులు, సైనికులు తమ ప్రాణాలను త్యాగం చేశారని పేర్కొన్నారు.

ఈ సంవత్సరంలో దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో 191 మంది జవాన్లు వీరమరణం పొందగా, వీరిలో తెలంగాణకు చెందిన 5 మంది ఉన్నారని తెలిపారు. వారందరికీ ఘన నివాళి అర్పించారు.

ఇప్పటి వరకు సంగారెడ్డి జిల్లాకు చెందిన నలుగురు వీరజవాన్లు విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేశారని ఎస్పీ తెలిపారు. సిర్గాపూర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన జంగయ్య , సంగారెడ్డి టౌన్ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఎల్లయ్య , జిన్నారం పోలీస్ స్టేషన్‌కు చెందిన సత్యనారాయణ , కంగ్టి పోలీస్ స్టేషన్‌కు చెందిన సురేష్ . వీరందరి ఆత్మలకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.

జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ ? పోలీస్ అమరుల త్యాగాలు చిరస్మరణీయమని, వారి ప్రాణత్యాగాల వలననే మనం నేడు సుఖసంతోషాలతో జీవిస్తున్నామని తెలిపారు. ఎలాంటి విపత్కర పరిస్థితుల్లోనైనా పోలీస్ శాఖ ధైర్యంగా ఎదుర్కొని ప్రజల రక్షణలో ముందుంటుందని అన్నారు. గత జూన్‌లో జరిగిన సిగాచి పరిశ్రమ పేలుడు ఘటనలో పోలీసులు ప్రాణాల పణంగా పెట్టి సహాయ కార్యక్రమాలు నిర్వహించారని ఆమె గుర్తుచేశారు.అమరుల కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాల సహాయం అందిస్తోందని, వారి సంక్షేమం, ఆర్థిక భద్రత కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పోలీస్ అమరవీరుల కుటుంబాలను ఉద్దేశించి మాట్లాడుతూ ? వారి మనోధైర్యం పెంపొందించడం, వారికి భరోసా కల్పించడం పోలీస్ శాఖకు ప్రధాన బాధ్యత అని అన్నారు. అనంతరం ఎస్పీతో కలిసి అమరుల కుటుంబ సభ్యులకు జ్ఞాపికలు అందజేశారు.

# విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి : ఎంఈఓ సత్యనారాయణరెడ్డి

మెదక్, అక్టోబర్ 21: చదువుతో పాటు విద్యార్థులు క్రీడల్లో రాణించి జిల్లాను రాష్ట్రంలో ముందంజలో ఉంచాలని సిద్దిపేట జిల్లా రాయపోల్ మండల విద్యాధికారి సత్యనారాయణ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని వడ్డేపల్లి మండల ప్రజా పరిషత్ పరిషత్ పాఠశాలకు 112 మంది విద్యార్థులకు స్పోర్ట్స్ యూనిఫామ్స్ టై, బెల్ట్, ఐడి కార్డ్స్, నోట్ పుస్తకాలను అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చదువుతోపాటు విద్యార్థులకు క్రీడలు ఎంతో ముఖ్యమని ప్రతి విద్యార్థి చదువుతోపాటు క్రీడల్లో ముందుండాలని పిలుపునిచ్చారు. విద్యార్థినీ విద్యార్థులు ఎంచుకున్న లక్ష్యాన్ని ముందుకు కొనసాగిస్తూ తమ లక్ష్యాన్ని చేరుకోవడానికి క్రీడలు, చదువు ఎంతో ముఖ్యమని సూచించారు. గ్రామీణ ప్రాంతాలు ఎంతోమంది ప్రతిభ కలిగిన క్రీడాకారులు నేడు జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు రాణిస్తున్నారని గుర్తు చేశారు.

క్రీడలకు ప్రభుత్వం తగిన ప్రోత్సాహం కల్పిస్తుందని ఈ అవకాశాన్ని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకొని క్రీడల్లో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాలన్నారు. అలాగే చదువులో మండలంలో జిల్లాలో రాష్ట్రస్థాయిలో గుర్తింపు తెచ్చుకోవాలని ఆయన విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, సీఆర్పీ యాదగిరి, ఉపాధ్యాయులు నరేష్, జీనత్, మాధురి, సాజిద్ పాల్గొన్నారు.

# సెక్రటేరియట్‌లోని వివిధ విభాగాలను సందర్శించిన రాజ్యసభ ఉపాధ్యక్షుడు మరియు చైర్మన్ శ్రీ సి.పి. రాధాకృష్ణన్



న్యూఢిల్లీ, అక్టోబర్ 21:భారత ఉపాధ్యక్షుడు మరియు రాజ్యసభ చైర్మన్ శ్రీ సి.పి. రాధాకృష్ణన్ ఈరోజు పార్లమెంట్ హౌస్‌లోని రాజ్యసభ సెక్రటేరియట్‌లోని వివిధ విభాగాలను సందర్శించారు. ఈ పర్యటనలో టేబుల్ ఆఫీస్, లెజిస్లేటివ్ విభాగం, ప్రశ్నాపత్రం శాఖ, సభ్యుల జీతాలు మరియు భత్యాల శాఖ, సభ్యుల సౌకర్యాల విభాగం, బిల్ ఆఫీస్, నోటీసు కార్యాలయం, లాబీ కార్యాలయం మరియు రిపోర్టర్స్ బ్రాంచ్ వంటి కీలక విభాగాలు ఉన్నాయి.

పర్యటన సందర్భంగా, ఉపాధ్యక్షుడు మరియు రాజ్యసభ ఛైర్మన్ సచివాలయం అధికారులు మరియు సిబ్బందితో సంభాషించారు మరియు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. రాజ్యసభ సజావుగా మరియు సమర్థవంతంగా పనిచేయడంలో వారి పాత్రను ఆయన ప్రశంసించారు.

శ్రీ సి.పి. రాధాకృష్ణన్ అధికారులు మరియు సిబ్బంది అంకితభావం మరియు వృత్తి నైపుణ్యంతో తమ వంతు కృషి చేయాలని, పార్లమెంటరీ పనితీరును బలోపేతం చేయాలని మరియు దేశ సేవకు కట్టుబడి ఉండాలని ప్రోత్సహించారు.

# మావోయిస్టులతో సంబంధాలు తెంచుకోవాలి

**-మావోయిస్టులకు మద్దతిస్తున్నతెలంగాణ నేతలకు బండి సంజయ్ హెచ్చరిక**

హైదరాబాద్ అక్టోబర్ 21 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: మావోయిస్టులతో సంబంధాలు తెంచుకోవాలని బిజెపి కేంద్రమంత్రి బండిసంజయ్ సూచించారు. మావోయిస్టులకు మద్దతిస్తున్న తెలంగాణ నేతలకు బండి సంజయ్ హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన 'ఎక్స్' లో పోస్టు చేశారు. మావోస్టులతో సంబంధాలు తెంచుకోకపోతే గుట్టు బయటపెడతామని, మావోయిస్టుల కట్టడితోనే కేంద్ర ఏజెన్సీలు ఆగిపోవు అని అన్నారు. అవినీతి, నేరగాళ్ల లింకులపై కేంద్రం నిఘా పెట్టిందని, ఎవరైనా, ఎంత పెద్ద స్థాయిలో ఉన్నా వదిలి పెట్టేది లేదని హెచ్చరించారు. దేశ భద్రత విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని తప్పుడు మార్గంలో వెళితే ఎంత పెద్ద నేతనైనా వదిలిపెట్టం అని బండిసంజయ్ పేర్కొన్నారు.




